## విలేకరులు కావలెను

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి'
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు
అనుభవం ఉన్న విలేకరులు కావలెను..
తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు
అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై
పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే
సంప్రదించండి.. సెల్ నెం: 9700370499

సీనియర్ జర్నలిస్ట్, ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



## టీవీ రిపోర్టర్లు కావలెను

A.P VISION TV

రెండు తెలుగు రాష్ట్రాలలో
సంచలనం సృష్టిస్తున్న
విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో
గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను.
ఆసక్తి ఉన్న వారు వెంటనే
సం॥ సెల్ నెం: 9700370499

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్ : పేరపోగు వెంకటేశ్వర్లు | ఆదివారం 20-07-2025 | సంపుటి : 11 | సంచిక : 170 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


# నేరస్థులు, హత్యా రాజకీయాలు చేసే వాళ్లు అవసరమా?









తిరుపతి, జులై 19: తిరుపతిలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక ప్రసంగం చేశారు. ముందుగా కార్యక్రమంలో పాల్గొని స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించారు. ఏపీని స్వచ్ఛాంధ్రగా మారుస్తూ అనేక అవార్డులు సాధిస్తున్నామని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో ఏపీకి ఐదు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు వచ్చాయని, అవార్డులు సాధించిన వారందరికీ అభినందనలు తెలియజేశారు సీఎం చంద్రబాబు. రాష్ట్రాభివృద్ధి కోసం ఒక్కో నెల ఒక్కో కార్యక్రమం చేపట్టామన్నారు.'పర్యావరణాన్ని కాపాడుదాం.. ప్లాస్టిక్ భూతాన్ని తరిమేద్దాం' అని పిలుపునిచ్చిన సీఎం చంద్రబాబు.. ప్లాస్టిక్ ఎక్కువగా వాడితే క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఎంతో ప్రమాదకరమని చంద్రబాబు చెప్పారు. 120 మైక్రాన్ ఉన్న కవర్లను పూర్తిగా నిలిపేద్దామన్నారు. క్లాత్ బ్యాగ్ వెండింగ్ యంత్రాలను అందుబాటులోకి తెస్తున్నామని చెప్పిన సీఎం.. ప్రపంచంలో ఏ వస్తువు నిరుపయోగం కాదని.. నిరుపయోగంగా ఉన్న వస్తువు నుంచి సంపద సృష్టించవచ్చని తెలిపారు. ప్రగతి పథంలో ముందుకెళ్తున్న మన రాష్ట్రానికి ఇప్పుడు నేర, హత్యా రాజకీయాలు చేసేవాళ్లు అవసరమా? అని సీఎం ప్రశ్నించారు.ఏపీలో పేరుకుపోయిన చెత్తను అక్టోబర్‌లోగా శుభ్రం చేస్తామన్న చంద్రబాబు.. ఏపీ స్వర్ణాంధ్రప్రదేశ్‌గా మారాలంటే స్వచ్ఛాంధ్ర ప్రదేశ్‌గా మార్చాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీ బాగుండాలంటే అందరూ స్వచ్ఛత పాటించాలని, ఆగస్టు నెలలోగా సచివాలయంలో ప్లాస్టిక్ పూర్తిగా నిషేధమని చంద్రబాబు తెలిపారు. డిసెంబర్‌లోగా ప్రభుత్వ ఆఫీసుల్లోనూ ప్లాస్టిక్ నిషేధం జరుగుతుందని చెప్పారు. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ నిర్మించి.. ఏని అభివృద్ధి చేస్తామని, క్వాంటమ్ వ్యాలీకి చిరునామాగా అమరావతి మారుతుందని చంద్రబాబు అన్నారు.ఒకప్పుడు ఐటీకి ప్రాధాన్యం.. ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీకి ప్రాధాన్యం ఉందని చంద్రబాబు అన్నారు. 'వాట్సాప్ గవర్నెన్స్ తీసుకొచ్చి ప్రభుత్వ సేవలను సులభతరం చేశాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 700 సర్వీసులు అందుబాటులో ఉన్నాయి.' అని ఆయన చెప్పారు.రాజకీయాలు కలుషితమైపోయాయని తెలిపిన సీఎం చంద్రబాబు.. నేరచరిత్ర ఉన్నవారు రాజకీయాల్లోకి వచ్చారని, నేర రాజకీయాలు చేసేవారు మనకు అవసరమా? అంటూ ప్రశ్నించారు. ఇంట్లో చెత్తను ఊడ్చినట్టు.. నేర చరిత్ర ఉన్న నేతలను ఊడ్చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. 'నా జీవితంలో ఎప్పుడూ హత్యా రాజకీయాలు లేవు. నక్సలిజం, ఫ్యాక్షన్, మతకలహాలపై పోరాడాను. నక్సలైట్లు నన్ను చంపాలని చూస్తే వేంకటేశ్వరస్వామి కాపాడారు. గత ఐదేళ్లు ప్రజలకు స్వేచ్ఛ లేదు. గత పాలకులు ప్రజల ఆరోగ్యాన్ని కూడా లెక్క చేయలేదు. ప్రజల భూములను కబ్జా చేసేందుకు యత్నించారు. మేం వచ్చాక ఫ్యాక్షనిజం, మతకలహాలను నివారించాం. హత్యా రాజకీయాలు చేయాలని చూస్తే ఎవరినీ వదిలిపెట్టను. నేరస్థుల గుండెల్లో నిద్రపోతా. వైసీపీ నేతలు వివేకా హత్యను గుండెపోటుగా చిత్రీకరించారు. నారాసుర రక్తచరిత్ర అని నాపై వివేకా హత్య నింద వేశారు. మామిడి రైతులకు టన్నుకు రూ.12వేలు ఇచ్చి ఆదుకుంటే, రోడ్డుపై మామిడి కాయలు పారబోసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పులివెందుల రాజకీయం చేశారు' అని సీఎం చంద్రబాబు విమర్శించారు.



# రానున్న 2 రోజులు పిడుగులతో కూడిన భారీ వర్షాలు..

## ఏపీకి విపత్తు నిర్వహణ శాఖ హెచ్చరిక!




అమరావతి: నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు పడే అవకాశముందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రానున్న రోజులూ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.

# 2047 వరకు మోడీ అవసరం ఉంది: నిశికాంత్ దూబే



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ చరిష్మాతోనే బిజెపికి ప్రజలు ఓట్లు వేస్తున్నారని బిజెపి ఎంపి నిశికాంత్ దూబే పేర్కొన్నారు. మోడీ ప్రధాని అయిన తరువాత బిజెపి ముఖ చిత్రం మారిపోయిందని ప్రశంసించారు. వరుసగా మూడు సార్లు లోక్ సభ ఎన్నికలలో, అనేక రాష్ట్రాలలో మోడీ నేతృత్వంలో బిజెపి పాలన కొనసాగిస్తోందని కొనియాడారు. బిజెపిలో మోడీ లేకుంటే లోక్ సభ ఎన్నికలలో 150 సీట్లు గెలుచుకోవడం కష్టం అని దూబే తన అభిప్రాయం వ్యక్తం చేశారు. బిజెపి లేని రాష్ట్రాలలో కూడా ఈ రోజు పాలన కొనసాగడానికి కారణం మోడీనేనని మెచ్చుకున్నారు.75 ఏళ్ల తరువాత బిజెపి నేతలు పదవీ విరమణ చేస్తారనే ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యలపై నిశికాంత్ స్పందించారు. మోడీ శరీరం సహకరించినంతవరకు, అంటే 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతే.. మోడీ లక్ష్యమని గుర్తు చేశారు. ఆ లక్ష్యం చేరేవరకు మోడీ అవసరం భారత్ కు ఉందన్నారు. మోడీ ప్రధాని అయిన తరువాత పేదల్లో ఎక్కువ మందికి బిజెపిపై నమ్మకం ఏర్పడిందని, తమ పార్టీ నచ్చినవాళ్లు కూడా ఉన్నారని, అందరికీ నచ్చాలని ఏమీ లేదన్నారు. మోడీ లేకపోతే బిజెపి బలంగా ఉండేది కాదని తాను కార్యకర్తగా నమ్ముతున్నానని దూబే కుండబద్దలు కొట్టారు.

# ఆర్థికాభివృద్ధిలో మీరూ భాగస్వాములు కండి

## ఐసిఎఐ అత్యంత గౌరవనీయమైన సంస్థ
## ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్‌హౌస్
## రానున్న మూడేళ్లలో ఏపిలో మోడల్ ఎడ్యుకేషన్ లక్ష్యం
## అభివృద్ధిలో పోటీపడడమే మా కర్తవ్యం
## రాజకీయ ఘర్షణలు మా అభిమతం కాదు
## ఐసిఎఐ గుంటూరు చాప్టర్ సమావేశంలో మంత్రి లోకేశ్

గుంటూరు,జూలై18: ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా అన్నది భారతదేశ మేధోశక్తికి వెన్నెముక లాంటిదని.. ఐసిఎఐ స్థాపించి 76 సంవత్సరాలు నిండినా ఆ సంస్థ ఇప్పటికీ యవ్వనంగానే ఉందని రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్ అన్నారు. ఈ సంస్థ భారతదేశంలో అతిపెద్ద సంస్థగా మాత్రమే కాదు, ప్రపంచంలోనే అతిపెద్ద అకౌంటింగ్ పవర్‌హౌస్‌గా ఉందన్నారు. గుంటూరు బండ్లమూడి గార్డెన్స్ లో ఐసిఎఐ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యాన స్ఫూర్తి పేరుతో నిర్వహించిన మెగా సిఎ విద్యార్థుల సమావేశానికి లోకేష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ... ఐసిఎఐ ప్రపంచంలోనే అత్యంత గౌరవనీయమైన, విశ్వసనీయ సంస్థగా గుర్తింపు పొందిందన్నారు. ప్రపంచంలో ఫోరెన్సిక్ అకౌంటింగ్ ప్రమాణాలతో పనిచేస్తున్న మొట్టమొదటి సంస్థ ఇదని.. ఐసిఎఐ ద్వారా 10లక్షలమందికి పైగా చార్టర్డ్ అకౌంటింగ్ విద్యను అభ్యసిస్తుండగా, ప్రతిఏటా 2లక్షలమంది పరీక్షలు రాస్తున్నారన్నారు. 4.07 లక్షల మంది సభ్యులు, 54 విదేశీ చాప్టర్లు కలిగిన అతిపెద్ద సంస్థ ఐసిఎఐ. వ్యాపారం ఎక్కడ ఉంటే భారత్ అక్కడ ఉంటుందని.. భారత్ ఎక్కడ ఉంటే అక్కడ ఐసిఎఐ ఉంటుందని లోకేష్ అన్నారు. తాను చార్టర్డ్ అకౌంటెంట్ కాకపోయినా స్టాన్‌ఫోర్డ్ ఎంబీఏ గ్రాడ్యుయేట్‌గా సిఎ ప్రాధాన్యత తెలుసన్నారు. సౌత్ ఆసియా లోనే మొట్టమొదటి క్వాంటమ్ కంప్యూటర్ జనవరిలో అమరావతిలో ఆవిష్కృతం కాబోతోంది. గతంలో జన్మభూమి, స్వయం సహాయక సంఘాలు, ఇ-గవర్నెన్స్, ఐటీ- హబ్‌లతో రాష్ట్ర చిత్రపటాన్ని మార్చేసిన చంద్రబాబునాయుడు... ఇప్పుడు క్వాంటమ్ వ్యాలీతో ఏపి రూపురేఖలు మార్చబోతున్నారు. మేం మార్పుకోసం వేచిచూడకుండా ఇక్కడ నుంచే మార్పునకు శ్రీకారం చుడుతున్నాం. పెట్టుబడుల కోసం పొరుగు రాష్ట్రాలతో పోటీపడుతున్నాం. అభివృద్ధి కోసం పోటీపడ తామే తప్ప.... రాజకీయ ఘర్షణ మా అభిమతం కాదు. అభివృద్ధి వికేంద్రీకరణ విధానంతో ముందుకు వెళ్తున్నాం. కర్నూలులో డ్రోన్ సిటీ-, కడపలో స్టీల్ ఎ÷-లాంట్, విశాఖలో ఏ ఎన్ ఎస్ ఆర్, సత్వ జిసిసితో పాటు- ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంటు- రాబోతున్నాయి. నేను విజనరీ లీడర్ చంద్రబాబు గారినుంచి స్ఫూర్తి పొందాను. ఆయన 75ఏళ్ల వయసులో 25 ఏళ్ల యువకుడిలా పనిచేస్తున్నారు. మాన్యుఫాక్చరింగ్, ఎనర్జీ, ఐటి, ఫార్మా... అన్ని రంగాల్లో ఏపీని నెం.1 గా నిలపాలన్నదే మా లక్ష్యం. రాబోయే మూడేళ్లలో ఏపీ మోడల్ ఎడ్యుకేషన్ తెచ్చేందుకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నా. యువత రాజకీయాల్లోకి రావాలి, తెలుగుదేశం పార్టీ యువత, విద్యావంతులను ప్రోత్సహిస్తుంది. మహిళా సాధికారిత ద్వారానే సమాజాభి వృద్ధి సాధ్యం. మార్పు మన ఇంటి నుంచే ప్రారంభం కావాలి. 1992లో చంద్రబాబు గారు ప్రారంభించిన హెరిటేజ్ ను నా తల్లి భువనేశ్వరి, భార్య బ్రహ్మణి సమర్థవంతంగా నిర్మిస్తున్నారు. నేటి ప్రపంచంలో, ఐక్యూ మంచిది, ఈక్యూ మంచిది. కానీ టిక్యూ కూడా తప్పనిసరి.




# పార్లమెంటులో అమీతుమీ.. ఇండియా కూటమి వర్చువల్ మీట్

న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో అధికార పక్షంతో అమీతుమీకి ఇండియా కూటమి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా సమావేశాల్లో చర్చించాల్సిన కీలక అంశాలు, అనుసరించాల్సిన వ్యూహంపై విపక్ష ఇండియా (ఎఔఆఎం) కూటమి నేతలు శనివారం వర్చువల్ సమావేశం నిర్వహించారు. 24 పార్టీలకు చెందిన నేతలు హాజరయినట్టు కాంగ్రెస్ నేత, రాజ్యసభ ఎంపీ జైరామ్ రమేష్ తెలిపారు. చాలా వారాల తర్వాత ఇండియా కూటమి నేతల సమన్వయ సమావేశం జరగడం విశేషం.కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చీఫ్ సోనియాగాంధీ, లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, సీపీఐ (ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య తదితరులు ఈ వర్చువల్ మీట్‌లో పాల్గొన్నారు. బీహార్‌లో ఎన్నికల కమిషనర్ ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టడం, ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి, ఆపరేషన్ సింధూర్ వంటి అంశాలు సమావేశం ఎజెండాలో కీలకంగా ఉన్నాయి.



భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు తాను మధ్యవర్తిత్వం చేశానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకోవడం, తన నివాసంలో కాలిన నోట్ల కట్టలు కనిపించడంతో వివాదంలో చిక్కుకున్న జస్టిస్ యశ్వంత్ వర్మను అభిశంసించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతుండటంపై వీటిపై ఉభయసభల్లో అనుసరించాల్సిన వైఖరిని సమావేశంలో చర్చించినట్టు తెలుస్తోంది.జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని కాంగ్రెస్ పట్టుబట్టనుంది. మహిళలపై పెరుగుతున్న నేరాలు, అహ్మదాబాద్ విమానం ప్రమాదం, పెరుగుతున్న నిరుద్యోగం, రైతుల కష్టాలు వంటి అంశాలను కూడా పార్లమెంటులో ప్రస్తావించాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ అంశాలపై పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై ఈవారం ప్రారంభంలో 10 జనపథ్ నివాసంలో సోనియాగాంధీ అధ్యక్షతన పార్టీ పార్లమెంటరీ స్ట్రాటజీ గ్రూప్ సమావేశం కూడా జరిగింది

# హైదరాబాద్‌లో పలు ప్రాంతాల్లో వర్షం

## రోడ్లన్నీ జలమయంతో వాహనాదారుల ఇక్కట్లు
## నైతురి ప్రభావంతో భారీ వర్షాలకు అవకాశం

హైదరాబాద్,జూలై19 హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయం అయ్యాయి. జవహర్‌నగర్‌లో రోడ్లపై భారీగా వరద ప్రవహిస్తోంది. శ్రీవేంకటేశ్వర కాలనీని వరద నీరు ముంచెత్తింది. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వెళ్లలేక ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో మరోసారి కుండపోతగా వర్షం కురిసింది. జీడిమెట్ల, కొంపల్లి, సుచిత్ర, బాలానగర్, బోయినపల్లి, ఆల్వాల్, మల్కాజ్‌గిరి, మౌలాలి, బేగంపేట్, మలక్‌పేట్, చార్మినార్, ముషీరాబాద్, అబిడ్స్, కోటి, హిమాయత్ నగర్, కాచిగూడ, లక్డీకాపూల్, ఖైరతాబాద్, అమీర్ పేట్, అశోక్ నగర్, సికింద్రాబాద్, ఉప్పల్, ముషీరాబాద్, బంజారాహిల్స్, ఓయూ, తార్నాక, నాచారం, మల్లాపూర్, హబ్సిగూడ, కొత్తపేట, హయత్ నగర్, వనస్థలిపురం, ఎల్‌బీ నగర్, దిల్‌సుఖ్‌నగర్, చంపాపేట, సరూర్‌నగర్, గాజుల రామారం, కుత్బుల్లాపూర్, నిజాంపేట్, మియాపూర్, లింగంపల్లి, బాచుపల్లి, హఫీజ్‌పేట్, ఈసీఐఎల్, కప్రా, నేరేడ్‌మెట్, విద్యానగర్, నల్లకుంట తదితర ప్రాంతాల్లో వాన దంచికొట్టింది. తీవ్ర వర్షం కారణంగా రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ఆఫీసు నుంచి ఇళ్లకు వెళ్లే -టైమ్ కావడంతో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

# సంపాదకీయం

ఆదివారం 20-07-2025

## ఆఫీస్ లో రొమాన్స్ కల్చర్

ప్రేమ ఎప్పుడు, ఎక్కడ మొదలవుతుందో ఎవరు చెప్పలేరు కరెక్టే. కానీ పెళ్లి తర్వాత కూడా ప్రేమలు పుడుతున్నాయంటూ రీసెంట్ స్టడీ తెలిపింది. అదీ కూడా ఎక్కడో కాదు.. ఆఫీస్?లే అడ్డాగా మారుతున్నాయంటూ షాకింగ్ విషయాలు వెల్లడించింది.ప్రస్తుతం మార్కెట్?లో రొమాంటిక్? రిలేషన్?షిప్స్ అందుబాటులో ఉంటున్నాయి. మార్కెట్?లో ఉన్నాయంటే ఇవేమి కొనుక్కునేవి కాదు. కానీ మార్కెట్?లో దొరికే వస్తువుల్లా మారిపోయాయి రిలేషన్?షిప్స్. ముఖ్యంగా జెన్? జి కిడ్స్ ఈ రిలేషన్? షిప్స్? ట్రెండ్స్?ని బాగా ఫాలో అవుతున్నారు. ప్రతి వ్యక్తితోనూ వారికున్న రిలేషన్?కి విచిత్రమైన పేర్లు పెట్టేసి ట్రెండ్ చేస్తున్నారు. తాజాగా జరిగిన సర్వే ప్రకారం.. ఆఫీసులో పనితో పాటు.. ఉద్యోగులు ప్రేమలో కూడా పడుతున్నారని.. దానికి కూడా కొన్ని కారణాలు ఉన్నాయని తెలిపింది. ఇంతకీ ఆ సర్వే ఏంటి? దానిలోని షాకింగ్ విషయాలు ఏంటో ఇప్పుడు తెలుసుకుందాం. రిలేషన్? షిప్స్? అనేవి రోజు రోజుకి కొత్త రంగు పులుముకుంటున్నాయి. ఈ రంగుల ప్రపంచం కోసం స్కూల్, కాలేజీ రోజులకే వెళ్లక్కర్లేదు. ఆఫీసులకు కూడా వెళ్లొచ్చు. ఇది మేము చెప్పేది కాదు.. ఈ అంశంపై నిర్వహించిన అనేక పరిశోధనలు చెప్తున్నాయి. పెళ్లికానీ వారితో పాటు.. వివాహితులు కూడా ఆఫీసుల్లోని తమ సహోద్యోగులతో ప్రేమ వ్యవహారాలు నడిపిస్తున్నారని తేలింది. ఇక్కడ గుర్తించాల్సిన మరో విషయం ఏమిటంటే.. గతంలో ఇతర దేశాల్లో ఈ కల్చర్ ఉండేదని.. ఇప్పుడు ఇండియాలో కూడా ఇది సాధారణంగా మారిపోయిందని తేల్చింది. ఈ సెన్సిటివ్ అంశంపై ఫోర్బ్స్ అడ్వైజర్ 2023-24కు గానూ ఓ సర్వే నిర్వహించింది. దీనిలో భాగంగా వారు 100 మంది ఉద్యోగులలో 60 మంది ఉద్యోగులు ఆఫీసు ప్రేమలో భాగమవుతున్నారంటూ షాకింగ్ విషయాలు తెలిపింది. హైలెట్ ఏంటి అంటే వీరిలో 40 శాతం మంది తమ పార్టనర్?తో కలిసి జీవించలేకపోతున్నామనే రీజన్ చూపించి.. ఆఫీస్ రిలేషన్?లోకి వెళ్తున్నారట. అటు తమ పార్టనర్?తో పాటు.. ఇటు లవ్?లో ఉన్నవారిని మోసం చేస్తూ ప్రేమ బంధాన్ని కొనసాగిస్తున్నట్లు తేలింది. ఫోర్బ్స్ అడ్వైజర్స్ చేసిన ఈ సర్వేలో 2000 మంది ఉద్యోగులు పాల్గొనగా.. వారిలో 61 శాతం మంది ఈ తరహా రిలేషన్?లోకి వెళ్లినట్లు తెలిపారు. 50 శాతం మంది ఉద్యోగులు తమ సహోద్యోగులను ఫ్లర్ట్ చేస్తున్నట్లు తెలిపారు. ఇండియాలోని పలు నగరాల్లో ఈ ఆఫీస్ ప్రేమలు పెరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఇండియాలో, ప్రపంచవ్యాప్తంగా పెద్ద నగరాల్లో పని చేసే ఉద్యోగుల్లో 20 నుంచి 25 శాతం మంది తమ సహోద్యోగితో రిలేషన్ పెంచుకున్నట్లు తెలిపారు. ఆఫీస్?లో ఈ తరహా రిలేషన్స్ పెరగడానికి కొన్ని కారణాలు ఉన్నాయట. దానిలో మొదటిది ఏంటి అంటే.. ఆఫీస్ తర్వాత బయటకు వెళ్లి లవ్? లైఫ్?ని వెతుక్కోవడం కష్టమవుతుందట. అంత సమయం ఉండట్లేదు కాబట్టి.. పైగా ఆఫీస్?లోనే ఎక్కువ సమయం ఉంటారు కాబట్టి.. బయటకు వెళ్లే అవసరం లేకుండా అదే ప్రదేశంలో లవ్ లైఫ్?ని ఎంచుకుంటున్నారట. ఈ తరహా ప్రేమను కొనసాగించడం చాలా ఈజీ అని 65 శాతంమంది ఒప్పుకున్నారు.సమస్యలను ఒకరికొకరు పంచుకోవడం ప్రారంభించినప్పుడు ఈ స్నేహం మొదలవుతుందన్నారు. ఈ తరహా రిలేషన్ కొనసాగించేవారు వర్క్?ని పక్కన పెడుతున్నారా అంటే లేదట. ఇంకా త్వరగా తమ టార్గెట్స్?ని కంప్లీట్ చేస్తున్నారట. అప్పుడు తాము ప్రేమించిన వారితో ఎక్కువ సమయం గడపవచ్చని భావిస్తున్నారట. ఈ ఆఫీస్ రిలేషన్ వల్ల కుటుంబంపై కచ్చితంగా ప్రభావం ఉంటుందట. ఎందుకంటే బయట కావాల్సిన రిలీఫ్ దొరికేస్తుంటే ఇంక ఇంట్లో దాని గురించి ఆలోచించట్లేదట. పైగా ఇంటికెళ్తే ఖర్చులు, బాధలు, వంటివే ఎక్కువగా కనిపిస్తాయట. కేవలం తిని, పడుకోవడానికి ఇంటికి వెళ్లేవారు కూడా ఉన్నారు. మరి ఫ్యామిలీతో టైమ్ స్పెండ్ చేసే వీలు ఎక్కడ ఉంటుంది. ఈ ఆఫీస్ రిలేషన్స్ వల్ల సొంత ఫ్యామిలీకి దూరమవుతున్నారని గుర్తిస్తే ఈ ట్రెండ్ కాస్త కనుమరుగయ్యే అవకాశముంది. ఇది క్లాసిక్ రిలేషన్?గా చెప్పొచ్చు. ఇద్దరు వ్యక్తులు జీవితాంతం కలిసి ఉండాలని కోరుకుంటూ లేదా డేటింగ్ చేస్తూ పెళ్లి చేసుకోవాలనుకుంటే దానిని రిలేషన్?షిప్ అంటారు. దీనిలో కమిట్?మెంట్ మేజర్ రోల్ ప్లే చేస్తుంది. అలాగే ఒకరికొకరు ఇచ్చుకున్న ప్రామిస్?లను వర్క్? అవుట్ చేసేందుకు ఇద్దరు ప్రయత్నిస్తూ ఉంటారుఈ రిలేషన్?లో ఇద్దరూ ఒకరినొకరు ఇష్టపడతారు. కానీ దానికంటూ ఏమి పేరు పెట్టరు. వీరు డేట్స్?కి వెళ్తారు. రోజంతా చాటింగ్ చేసుకుంటారు. కొన్ని సందర్భాల్లో రొమాన్స్ కూడా చేసుకుంటారు. కానీ ఈ రిలేషన్?ని సీరియస్?గా తీసుకెళ్లరు. పరిస్థితులకు అనుగుణంగా తమ రిలేషన్ కొనసాగిస్తారు. ఈ రిలేషన్?లో ఇద్దరూ ప్రేమించుకుంటారు. అలాగే వీరిద్దరూ వేరే వాళ్లతో రిలేషన్?ని పెట్టుకున్నా ఎలాంటి గొడవలు లేకుండా యాక్సెప్ట్ చేస్తారు. ఈ రిలేషన్?షిప్?ని కమ్యూనికేషన్?తో, నమ్మకంతో ముందుకు తీసుకెళ్తారు. ఎలాంటి జెలసీ ఉండదు. ప్రేమించుకున్న ఇద్దరు వ్యక్తులు సిటీకి దూరంగా, విదేశాల్లో ఉంటూ తమ ప్రేమను కొనసాగిస్తే దానిని లాంగ్ డిస్టెన్స్ రిలేషన్?షిప్ అంటారు. తమ శారీరక, మానసిక రిలేషన్?ని కాల్స్, మెసేజ్?లు, వీడియో చాట్స్?తో రిప్లేస్ చేస్తారు. వాళ్లు కలిసినప్పుడు ఆ మూమెంట్?ని సెలబ్రేట్? చేసుకుంటారు. ఇద్దరు ప్రేమించుకున్న వ్యక్తులు విడిపోయేంత గొడవపడిన మళ్లీ కలిసి ఉండడాన్ని లవ్ హేట్ రిలేషన్?షిప్ అంటున్నారు. వారిపై ప్రేమను, కోపాన్ని, ఫ్రస్టేషన్?ని కూడా ఒకేలా ఎదుటి వ్యక్తికి చూపిస్తారు. క్రిస్పీగా చెప్పాలంటే వారు ఒకరికొకరు అర్థంకారు. కానీ కలిసే ఉంటారు. విడిపోయి ఉండలేరు. ఆఫీస్ కోసం తర్వగా ఇంటి నుంచి బయల్దేరడం, ఆఫీస్? నుంచి లేట్?గా రావడం వల్ల వారికి ఆఫీస్? అన్ని రకాలుగా సేఫ్ అనిపిస్తుందని తెలిపారు.

## కరోనా కాలంలో బీజేపీ ఆర్థిక క్రమశిక్షణ

హైదరాబాద్, జూలై 19, దేశంలో 2004 నుంచి 2014 వరకు కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం అధికారంలో ఉంది. ఇక 2014 నుంచి 2024 వరకు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలో ఉంది. రెండు కూటముల పదేళ్ల పాలన సరిపోల్చాల్సిన సమయం ఇదే. ఎవరి పాలన ఎలా ఉందో ప్రజలకు తెలియాల్సిన, తెలుసుకోవాల్సిన అసవరం కూడా ఉంది. కాంగ్రెస్ విధానాలు సామాజిక సంక్షేమం, మైనారిటీ హక్కులు, సమ్మిళిత ఆర్థిక విధానాలు, మైనారిటీలు, పట్టణ మేధావులు, గ్రామీణ ఓటర్లపై ఆధారపడి ఉంది. బీజేపీ విధానాలు హిందుత్వ, మార్కెట్?ఆధారిత ఆర్థిక సంస్కరణలు, జాతీయ భద్రతపై ఉన్నాయి.2004?2014 మధ్య కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం జీడీపీలో 94% వృద్ధిని సాధించగా, 2014?2024 మధ్య బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ పాలనలో జీడీపీ 77% పెరిగింది. జీడీపీ లెక్కింపు విధానంలో మార్పులు బీజేపీ హయాంలో సంభవించినప్పటికీ, కాంగ్రెస్ కాలంలో ఆర్థిక వృద్ధి గణనీయంగా ఎక్కువగా ఉంది. తలసరి ఆదాయంలో కాంగ్రెస్ పాలనలో 69% వృద్ధి నమోదైంది, అయితే బీజేపీ హయాంలో ఇది 60% మాత్రమే. ప్రపంచంలో 195 దేశాల్లో భారత్ తలసరి జీడీపీ ప్రకారం 136వ స్థానంలో ఉండటం దేశంలో ఆర్థిక అసమానతలను సూచిస్తుంది.స్టాక్ మార్కెట్ సూచిక అయిన సెన్సెక్స్ 2004?2014 మధ్య 300% పెరిగింది, బీజేపీ పాలనలో (2014?2024) 229% వృద్ధి నమోదైంది. కాంగ్రెస్ కాలంలో స్టాక్ మార్కెట్ బలమైన పనితీరును కనబరిచింది.కాంగ్రెస్ పాలనలో ఎగుమతులు 273% పెరగగా, బీజేపీ హయాంలో కేవలం 76% వృద్ధి కనిపించింది. విదేశీ పెట్టుబడుల విషయంలో కూడా కాంగ్రెస్ పాలనలో 646% వృద్ధి సాధించగా, బీజేపీ కాలంలో 79% మాత్రమే పెరిగింది. ద్విచక్రవాహనాల

అమ్మకాలు కాంగ్రెస్ హయాంలో 158% పెరగగా, బీజేపీ పాలనలో 23% మాత్రమే పెరిగాయి. అదేవిధంగా, కార్ల అమ్మకాలు కాంగ్రెస్ కాలంలో 145% వృద్ధి చెందగా, బీజేపీ హయాంలో 65% పెరిగాయి.ప్రభుత్వ అప్పు కాంగ్రెస్ పాలనలో 217% పెరగగా, బీజేపీ హయాంలో 189% వృద్ధి నమోదైంది, ఇది కొంతమేర ఆర్థిక క్రమశిక్షణను సూచిస్తుంది. అయితే, బీజేపీ పన్నులు పెంచడం, ఖర్చులు పెంచడం వంటి విధానాలు ఆర్థిక ప్రగతిని కొంతమేర పరిమితం చేశాయి.మోదీ "మినిమం గవర్నమెంట్, మాక్సిమం గవర్నెన్స్" అనే నినాదంతో అధికారంలోకి వచ్చినప్పటికీ, ఎస్‌బీఐ, బీఎస్ఎన్ఎల్ వంటి సంస్థలకు ప్రత్యేక సాయం అందించడం, సోషలిస్టు ఆంక్షలు విధించడం వంటి చర్యలు ఆర్థిక సంస్కరణలకు అడ్డంకిగా నిలిచాయి. హిందుత్వ ఎజెండాపై దృష్టి సారించినప్పటికీ, అభివృద్ధి లక్ష్యాల్లో బీజేపీ విఫలమైందనే విమర్శలు ఉన్నాయి.

## జ్యోతిలక్ష్మి ఎంత చేసిందో తెలుసా

సిమ్లా, జూలై 19,సంసార జీవితాన్ని వద్దనుకున్నారు. ఉప్పుకారాన్ని దూరం పెట్టారు. మమకారాన్ని కాదనుకున్నారు. ఒంటికి వేరే దుస్తులను ధరించి.. వారి బతుకేదో వారు బతుకుతున్నారు. దేవుడి సేవలో తరిస్తున్నారు. సంసారం వద్దని.. సన్యాసముద్దని జీవిస్తున్నారు. కానీ అలాంటి వారి జీవితంలోకి జ్యోతిలక్ష్మి లాగా వచ్చింది. కనిపించి కనిపించినట్టు.. చూపించి చూపించినట్టు రెచ్చగొట్టింది. ఇంకేముంది ఇన్నాళ్లపాటు దూరమైనది దగ్గరికి రావడంతో వారిలో ఏవో కోరికలు కలిగాయి. ఇక్కడే థ్రిల్లర్ సినిమాను మించిన ట్విస్ట్ చోటుచేసుకుంది.బౌద్ధ సన్యాసులను లక్ష్యంగా చేసుకుని ఓ యువతి వలపు వల విసిరింది. తన చేతలతో, చూపులతో రెచ్చగొట్టింది.. దీంతో ఇన్నాళ్లపాటు స్తబ్దుగా ఉన్న వారి లో " మగతనం" ఒక్కసారిగా బుసలు కొట్టింది. ఆడ తోడు కోసం తహతహలాడింది. వారిలో ఆత్రుతను పెంచిన ఆ యువతి అసలు కథ మొదలుపెట్టింది.. ప్రతిరోజు వారి దగ్గరికి రావడం.. రకరకాల మాటలు చెప్పడం.. రెచ్చగొట్టే చేష్టలకు పాల్పడడంతో వారు తట్టుకోలేకపోయారు. ఆ సుఖం ఎప్పుడెప్పుడా అని తాపత్రయపడ్డారు. వారి తొందరను అర్థం చేసుకున్న ఆమె మరింత ఉద్రేక పరిచింది. దీంతో తట్టుకోవడం వారి వల్లకాలేదు. ఇదే అదునుగా ఆమె తన అసలు రూపాన్ని ప్రదర్శించింది. వారితో అత్యంత సన్నిహితంగా ఉండటం మొదలుపెట్టింది. వాటన్నిటిని వీడియోలు తీసింది. ఫోటోలు కూడా తీసింది. ఆ తర్వాత వాటిని అందరికి చూపిస్తానంటూ బెదిరించడం మొదలుపెట్టింది. ఇలా తొమ్మిది మంది సన్యాసులను సన్నాసులను చేసింది. 102 కోట్లు వసూలు చేసింది.. ఆమె దెబ్బకు ఒక వ్యక్తి సన్యాసం కూడా వదిలిపెట్టాడు.ఈ విషయం అక్కడ పోలీసులకు తెలిసింది.. పోలీసులు అత్యంత గోప్యంగా దర్యాప్తు మొదలు పెట్టారు. ఆమె బ్యాంక్ ఖాతాలను ఫ్రీజ్ చేయించారు. అదుపులోకి తీసుకొని విచారణ ప్రారంభించారు. ఈ విషయాలు బయటకు రాకుండా ఉండడానికి పోలీసులు శత విధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు. మిస్ గోల్ఫ్ పేరుతో ఇంకా ఎవరైనా బాధితులు ఉన్నారా.. అనే కోణంలో పోలీసులు వివరాల సేకరిస్తున్నారు.." ఈ ప్రాంతంలో బౌద్ధ సన్యాసులు ఎక్కువగా ఉంటారు. వారు ధ్యానం లోనే మునిగి తేలుతూ ఉంటారు. వాడి దగ్గర ఇంత డబ్బు ఎక్కడిది అనేది అర్థం కావడం లేదు. ఎవరైనా ఇచ్చారా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నాం. ఆమె 102 కోట్లు వసూలు చేయడం మాక్కూడాగ్ర్భాంతిని కలిగిస్తోంది. ఈ కేసు దర్యాప్తులో ఇంకా చాలా వివరాలు రాబట్టాల్సి ఉంది.. ప్రస్తుతానికి ఆమెను విచారిస్తున్నాం. బాధితుల నుంచి వివరాలు సేకరించాం. ఆమె వద్ద ఉన్న ఫోటోలను, వీడియోలను కూడా స్వాధీనం చేసుకున్నామని" పోలీసులు చెబుతున్నారు.

## గేమ్ ఛేంజర్ గా రింగ్ రైలు

హైదరాబాద్, జూలై 19,కేంద్రంలో ఎన్డీఏ అధికారంలోకి వచ్చాక, నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక.. రహదారులు, రైలు మార్గాల విస్తరణ, రవాణా సౌకర్యం మెరుగుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. అనేక జాతీయ రహదారులు నిర్మించారు. ఇంకా నిర్మాణలో అనేక రహదారులు ఉన్నాయి. ఇక రైలు మార్గాల విస్తరణ కూడా జరుగుతోంది. ఈ క్రమంలో తెలంగాణలో కూడా రహదారులు, రైలు మార్గాల విస్తరణ జరుగుతోంది. తాజాగా. హైదరాబాద్ చుట్టూ రింగ్ రైలు మార్గాన్ని నిర్మించే ప్రాజెక్టు, దేశంలోనే మొట్టమొదటి రకం ప్రయత్నంగా గుర్తింపు పొందింది. ఇటీవల పూర్తయిన ఫైనల్ లొకేషన్ సర్వేతో, ఈ ప్రాజెక్టు దిశగా కీలక అడుగు పడింది. సికింద్రాబాద్ నుంచి దేశంలోని వివిధ రాష్ట్రాలకు వెళ్లే ఆరు రైలు మార్గాలతో అనుసంధానం కానున్న ఈ ప్రాజెక్టు, రాష్ట్ర రవాణా వ్యవస్థను విప్లవాత్మకంగా మార్చనుంది.హైదరాబాద్ చుట్టూ నిర్మించే ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టు రాష్ట్ర రవాణా వ్యవస్థను మార్చివేయనున్న ఒక గేమ్?ఛేంజర్. ఈ 536?564 కిలోమీటర్ల పొడవైన రైలు మార్గం, సికింద్రాబాద్ నుంచి విజయవాడ, గుంటూరు, వరంగల్, నిజామాబాద్, మెదక్, ముంబై, వికారాబాద్ వంటి ఆరు కీలక రైలు మార్గాలతో అనుసంధానం కానుంది. దేశంలోనే మొట్టమొదటి రింగ్ రైలు ప్రాజెక్టుగా, ఇది హైదరాబాద్‌లోని ప్రధాన రైల్వే స్టేషన్లపై ఒత్తిడిని తగ్గించడంతో పాటు, చుట్టుపక్కల జిల్లాలకు సమర్థవంతమైన కనెక్టివిటీని అందిస్తుంది.ఈ ప్రాజెక్టు 8?10 జిల్లాలను (మెదక్, సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నల్గొండ, యాదాద్రి?భువనగిరి, సిద్దిపేట, జనగామ, కామారెడ్డి) కలుపుతూ, కొత్త రైల్వే స్టేషన్ల నిర్మాణంతో ప్రాంతీయ కనెక్టివిటీని బలోపేతం చేస్తుంది. ఇది స్థానిక వ్యవసాయ, వ్యాపార, విద్య, ఆరోగ్య, పర్యాటక రంగాలను బలపరుస్తుంది, రైస్, మొక్కజొన్న, పత్తి, పసుపు వంటి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ఊతమిచ్చే అవకాశం ఉంది. ఈ రైలు మార్గం ప్రధానంగా గూడ్స్ రైళ్లను సికింద్రాబాద్, హైదరాబాద్, నాంపల్లి స్టేషన్ల గుండా వెళ్లకుండా ఇతర రూట్లలోకి మళ్లించడానికి వీలు కల్పిస్తుంది. దీనివల్ల ఈ స్టేషన్లపై ఒత్తిడి తగ్గి, సరుకు రవాణా సమర్థత పెరుగుతుంది. సిమెంట్, క్లింకర్ వంటి పరిశ్రమలకు ఈ మార్గం ఒక వరంగా మారనుంది.దక్షిణ మధ్య రైల్వే మూడు ఎలైన్మెంట్ ఆప్షన్లను ప్రతిపాదించింది, వీటిలో ఆప్షన్?2 జనగామ, కామారెడ్డి జిల్లాలను కూడా కలుపుతుంది. ఈ ఆప్షన్లు వివిధ జిల్లాల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించబడ్డాయి, తుది ఎలైన్మెంట్ ఖరారు కోసం విశ్లేషణ జరుగుతోంది. ఈ ప్రాజెక్టు హైదరాబాద్‌లోని రద్దీని తగ్గించడంతో పాటు, రీజనల్ రింగ్ రోడ్‌తో సమన్వయంతో కొత్త శివారు పట్టణాలు, పారిశ్రామిక జోన్ల అభివృద్ధికి దోహదం చేస్తుంది. ఇది రాష్ట్రంలోని సామాజిక?ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేస్తూ, హైదరాబాద్‌ను ఒక ప్రపంచ స్థాయి నగరంగా మరింత బలోపేతం చేస్తుంది.

## ఘనంగా ప్రారంభమైన తాండూర్ ఉర్సు ఉత్సవాలు

**ఈ ఉత్సవాలకు వంద ఏండ్ల చరిత్ర**

**వివిధ రాష్ట్రాల నుండి భక్తుల రాక**

**కట్టుదిట్టంగా పోలీస్ భద్రత ఏర్పాట్లు**

తాండూర్,ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే బెల్లంపల్లి నియోజకవర్గంలో గల తాండూర్ ఉరుసు ఉత్సవాలకు ఎంతో ఘన చరిత్ర ఉంది. ఈ మేరకు ఆదివారం తాండూర్ గ్రామంలోని దర్గా వద్ద ఘనంగా ఉరుసు ఉత్సవ వేడుకలను ప్రారంభించారు ఈ ఉరుసు ఉత్సవాలు గత 300 సంవత్సరాల నుండి కొనసాగుతున్నాయి. ఈ యొక్క ఉత్సవాల్లో కవాలి నృత్యాలు సైతం ఉండనున్నాయి. ఇందుకు గాను వివిధ. రాష్ట్రాల నుండి కళాకారులను రప్పిస్తున్నారు. అవి అక్కడికి వచ్చిన భక్తులను ఎంతగానో అలరింపచేస్తూ ఆకట్టుకుంటాయి. ముక్యంగా కవాలి నృత్యాలు తిలకించడానికి చిన్నా, పెద్దా తేడా లేకుండా హాజరవుతారు. రాత్రింబవళ్లు అక్కడ కాలక్షేపం చేయడం ప్రతీ ఏట కనబడుతుంది. ఎంతో ప్రాముఖ్యం గల ఈ ఉరుసు ఉత్సవాలను తిలకించడానికి వివిధ రాష్ట్రాల నుండి సైతం భక్తి శ్రద్ధలతో భక్తులు పెద్ద ఎత్తున తరలి రానున్నారు. కుల,మత వర్గాలకు అతీతమైనది కావడంతో ఈ ఉత్సవంకు ఎంతో ప్రాధాన్యం, ప్రాముఖ్యం సంతరించుకుంది. దీంతో సబ్బండ వర్గాలు తరలి రావడం మనకు శనిపిస్తుంది. కొంత మంది ఈ ఉత్సవాల్లో పాల్గొనడానికి ముందస్తుగానే తాండూర్ మండల కేంద్రానికి చేరుకున్నారు. వారి వారి సమీప బంధువుల ఇళ్లళ్ళకు చేరుకున్నారు. ఈ వేడుకలకు దర్గా కమిటీ ముందస్తు ఏర్పాట్లను సైతం పూర్తి చేశారు. ఈ మేరకు దర్గా చుట్టుపక్కల సమీప పరిసరాలను పరిశుభ్రం చేశారు. దర్గా నిర్మాణాలకు సైతం రంగులు అర్థి అలంకరించి చేశారు. ఈ తృవాలకు రానున్న భక్తులుకు ఎలాంటి అసౌకర్యం కాకుండా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కమిటీ జదివరకే ప్రకటించింది. సందర్శకుల సౌకర్యార్థం చిరు వ్యాపార సముదాయాలు వెలిశాయి. ఈ సమదాయాల్లో తినుబండారాల నుండి మొదలుకొని పిల్లల ఆట వస్తువుల వరకు లభించును ఈ రెండు రోజుల ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా దర్గా కమిటీకి పోలీసు వారు సైతం దిశా నిర్దేశం చేస్తున్నారు.

## గాల్లో రాయి వేశారా...

**భేటీ రహస్యం ఏంటీ**

హైదరాబాద్, జూలై 19, రాజకీయాల్లో శాశ్వత శత్రువులు.. శాశ్వత మిత్రులు ఉండరు. ఎవరి అవసరం వారికి ఉంటుంది. సిద్ధాంతాల వరంగానే విభేదించుకుంటారు. అవసరం ఉన్నప్పుడు కలుసుకుంటారు, కలిసి పోటీ చేస్తారు. పొత్తు పెట్టుకుంటారు.. మద్దతు ఇచ్చుకుంటారు. అయితే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పుట్టిన పార్టీ టీఆర్ఎస్. నాడు రాష్ట్ర విభజనను తెలుగుదేశం పార్టీ వ్యతిరేకించింది. దీంతో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఆయన కొ ?కు కేటీఆర్ టీడీపీని ఆంధ్రా పార్టీగానే చూశారు. కానీ, రాష్ట్ర విభజన తర్వాత ఓటుకు నోటు కేసులో చంద్రబాబునాయుడును బుక్‌చేసి హైదరాబాద్ నుంచి పంపించారు. అప్పటి నుంచి టీడీపీ, టీఆర్ఎస్ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. గతంలో టీడీపీతో కలిసి పోటీ చేసిన కేసీఆర్.. రాష్ట్ర విభజన తర్వాత ఒక్కసారి కూడా కలవలేదు. కానీ, కేటీఆర్ ఇటీవల లోకేశ్‌ను రహస్యంగా కలిసినట్లు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఈ సమావేశాల వెనుక ఉద్దేశం ఏమిటని రేవంత్ ప్రశ్నించారు. ఈ ఆరోపణలు రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి.రేవంత్ రెడ్డి జులై 17న ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ, కేటీఆర్ లోకేష్‌ను అర్ధరాత్రి సమయంలో రహస్యంగా కలిశారని ఆరోపించారు. ఈ సమావేశాలు జీహెచ్ఎంసీ ఎన్నికలకు సంబంధించినవా లేక ఆంధ్రా సెటిలర్స్ ఓట్లను ప్రభావితం చేయడానికి సంబంధించినవా అని ప్రశ్నించారు. అదనంగా, కేటీఆర్ స్నేహితుడు కేదార్ దుబాయ్‌లో డ్రగ్స్ వాడి మరణించిన ఘటనను ప్రస్తావిస్తూ, దానికి సంబంధించిన ఫోరెన్సిక్ రిపోర్టులను తెలంగాణకు తెప్పించినట్లు చెప్పారు. ఈ ఆరోపణలు రాజకీయంగా కేటీఆర్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి, కానీ వీటికి ఆధారాలు లేవు.కేటీఆర్ ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. జులై 18న ఒక ఇంటర్వ్యూలో, లోకేష్‌ను కలవలేదని, అవసరమైతే పట్టపగలు కలుస్తానని, లోకేష్ తనకు సోదరుడిలాంటి వ్యక్తి అని అన్నారు. రేవంత్ ఆరోపణలకు ఆధారాలు చూపాలని సవాల్ చేసిన కేటీఆర్, ఈ వివాదాన్ని రాజకీయ కుట్రగా అభివర్ణించారు. అయితే రేవంత్ ఆరోపణలకు సమాధానంగా ఆధారాలు ఇంకా బహిర్గతం కాలేదు.లోకేష్ (టీడీపీ), కేటీఆర్ (బీఆర్ఎస్) రెండు వేర్వేరు రాష్ట్రాలు, రాజకీయ భావజాలాలకు చెందిన నాయకులు. అయినప్పటికీ, రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న సాంస్కృతిక, రాజకీయ సంబంధాలు ఇటువంటి సమావేశాల ఊహాగానాలకు ఆస్కారం ఇస్తాయి. జీహెచ్ఎంసీ ఎన్నికలలో ఆంధ్రా సెటిలర్స్ ఓట్లు కీలకం కావడం, రెండు రాష్ట్రాల మధ్య వాణిజ్య, రాజకీయ సహకార అవసరాలుఈ ఆరోపణల వెనుక కారణాలుగా ఉండవచ్చు. అయితే, ఈ సమావేశాలు నిజంగా జరిగాయా లేక రాజకీయ ఎత్తుగడల కోసం సృష్టించబడిన కథనమా అనేది స్పష్టత రావాల్సి ఉంది.

## శృంగారం కాదంటే భార్యకు విడాకులు ఇవ్వొచ్చు

ముంబై, జూలై 19, : భార్య శృంగారానికి అంగీకరించకపోతే విడాకులు ఇవ్వొచ్చని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. ఇదే కారణంతో విడాకుల కోసం పిటిషన్ వేసిన ఓ వ్యక్తి అభ్యర్థనను అనుమతిస్తూ కుటుంబ కోర్టు ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను కోర్టు తోసిపుచ్చింద భర్తతో శారీరక సంబంధాన్ని తిరస్కరించడం , అతనికి వివాహేతర సంబంధం ఉందని అనుమానించడం క్రూరత్వానికి సమానమని బాంబే హైకోర్టు స్పష్టం చేసింది. విడాకులు ఇచ్చేందుకు ఇది కూడా ఒక కారణం అని తెలిపింది. కుటుంబ కోర్టు విడాకుల ఉత్తర్వును సవాలు చేస్తూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను తోసి పుచ్చింది. జస్టిస్ రేవతి మోహితే , నీలా గోఖలేలతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆ మహిళ ప్రవర్తనను ఆమె భర్తపై "క్రూరత్వం"గా భావించవచ్చని పేర్కొంది. విడాకుల కోసం వ్యక్తి అభ్యర్థనను అనుమతిస్తూ కుటుంబ కోర్టు ఉత్తర్వు ఇచ్చింది. దీన్ని కొట్టివేయడంతో పాటు తనకు నెలవారీ రూ. లక్ష భరణం చెల్లించాలని ఇప్పించాలని కోర్టులో మహిళ వాదించింది. ఈ జంట 2013లో వివాహం చేసుకున్నా. కానీ డిసెంబర్ 2014లో విడివిడిగా జీవించడం ప్రారంభించారు. 2015లో, ఆ వ్యక్తి క్రూరత్వం కారణంగా విడాకులు కోరుతూ పూణేలోని కుటుంబ కోర్టును ఆశ్రయించాడు. కుటుంబ కోర్టు విడాకులు మంజూరు చేసింది. ఆ మహిళ తన పిటిషన్‌లో తన అత్తమామలు తనను వేధించారని ఆరోపించింది. అయితే తనకు తన భర్తపై ప్రేమ ఉందని, అందుకే వివాహం ముగియాలని కోరుకోవడం లేదని పేర్కొంది.కానీ శారీరక సాన్నిహిత్యాన్ని తిరస్కరించడం, వివాహేతర సంబంధాలు కలిగి ఉన్నాడని అనుమానించడం, తన కుటుంబం, స్నేహితులు, ఉద్యోగుల ముందు తనను ఇబ్బంది పెట్టడం ద్వారా మానసిక వేదనకు గురిచేయడం వంటి అనేక కారణాల వల్ల తాను క్రూరత్వాన్ని అనుభవించానని ఆ వ్యక్తి కోర్టుకు తెలిపారు. భర్తకు ప్రత్యేక వైకల్యం ఉన్న సోదరి ఉంది. ఆ మహిళ ఉదాసీనంగా కూడా అతనికి , అతని కుటుంబ సభ్యులకు బాధను కలిగిస్తుందని కోర్టు పేర్కొంది. మహిళ పిటిషన్‌ను తోసిపుచ్చిన కోర్టు, దంపతుల మధ్య వివాహం చెడిపోయిందని, సరిదిద్దుకునే అవకాశం లేకుండానే విచ్చిన్నమైందని పేర్కొంది. విడాకులు మంజూరు చేస్తూ కుటుంబ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.

## యూరియా కోసం చెప్పుల క్యూ

భూపాలపల్లి వానాకాలం పంటలకు కావలసిన యూరియా కోసం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల రైతులు తిప్పలు పడాల్సి వస్తోంది. సీజన్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నప్పటికీ యూరియా అందుబాటులో లేకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. సహకార సంఘాల ద్వారా యూరియా పంపిణీ జరుగుతున్నప్పటికీ డిమాండ్ మేరకు సప్లై లేకపోవడంతో రైతులు సొసైటీల వద్ద పడిగాపులు పడుతున్నారు. పీఏసీఎస్ ఆవరణలో చెప్పుల లైను దర్శనమిచ్చింది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి యూరియా కొరత లేకుండా రైతులకు అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

# కవితను వాస్తు దోషం పీడిస్తోందా

హైదరాబాద్, జూలై 19,ఇంటి వాస్తు.. ఇది చాలామంది నమ్మకం. ఈ వాస్తు బాగుంటేనే మనకు మంచి జరుగుతుంది అని.. తాము చేసే అన్ని కార్యక్రమాలలో విజయం సాధిస్తామని నమ్ముతూ ఉంటారు. అందులో ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిన ఎమ్మెల్సీ కవిత కూడా వాస్తు మార్పులు చేయిస్తున్నారు. గతంలో ఎంపీగా ఉన్న సమయంలో ఆమె హైదరాబాదులో గాంధీనగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండేవారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కూడా కవితకు సరైన నివాసం లేదు. అప్పటి ఎన్నికల్లో ఆమె తన సిట్టింగ్ స్థానం అయిన నిజామాబాద్ పార్లమెంటు నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత బంజారాహిల్స్‌లోని నంది నగర్‌లో సొంత ఇంటిని నిర్మించుకున్నారు కవిత. అయితే ఆ ఇంట్లోకి వెళ్లిన నాటి నుంచి ఆమెకు సరిగ్గా కలిసి రాలేదని ప్రచారం జరుగుతుంది. దాదాపు రెండు సంవత్సరాల పాటు దగ్గరుండి ఎంతో ఇష్టంగా కట్టించుకుని ఇంట్లోకి గృహప్రవేశం చేసిన కవితకు.. ఆ తర్వాత నుంచి ఇబ్బందులు మొదలయ్యాయని ఆమె అనుచరులు చెబుతూ ఉంటారు. ఆ ఇంట్లోకి వచ్చిన నాటి నుంచి ఈడి కేసులు, సిబిఐ కేసులతో ఆమె సతమతమైంది. నందినగర్‌లోని తన ఇంట్లో ఉన్న సమయంలోనే ఈడి అధికారులు ఆమెను అరెస్టు చేసి ఢిల్లీకి తీసుకెళ్లారు. ఆ తర్వాత దాదాపు ఆరు నెలపాటు జైలు జీవితం గడిపిన కవిత ..మళ్లీ అదే ఇంటికి వచ్చారు. జైలుకు వెళ్లి వచ్చిన తర్వాత పార్టీ కార్యక్రమాల్లో ఆమెకు స్థానం దక్కడం లేదని కొంత నిరాశకు గురై తన తండ్రికి లేఖ రాశారు కవిత. తర్వాత పార్టీని, కేటీఆర్‌ని, హరీష్ రావుని ఇన్ డైరెక్ట్‌గా విమర్శిస్తూ వస్తున్నారు. అయితే కవిత ఇంతలా విమర్శలు చేస్తున్నా? బిఆర్ఎస్ అగ్ర నేతలతో పాటు అందరూ లైట్ తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కవిత ఓ సిద్ధాంతి సూచనల మేరకు వాస్తు మార్పులకు సిద్ధమయ్యారు. నెల క్రితమే తన ఇంటి పక్కనే ప్రారంభించిన తెలంగాణ జాగృతి కార్యాలయంలో కూడా వాస్తు మార్పులు చేపట్టారు. ప్రధానంగా ఆమె ప్రస్తుతం నివాసం ఉంటున్న ఇంటి ముందు గోడను తొలగించారు. ఈ మధ్యకాలంలోనే పూజ కార్యక్రమాలు పూర్తి చేసి మొదలుపెట్టిన జాగృతి కార్యాలయం ఎంట్రెన్స్ కూడా పక్కకు మార్చారు. ఇక ప్రస్తుతం ఆమె నివాసం ఉంటున్న ఇంట్లోకి ప్రవేశించే ప్రధాన ద్వారాన్ని పక్కకు మార్చుతున్నారు. ఇప్పుడు వాయువ్య మూలలో ఉన్న ప్రధాన ద్వారాన్ని ఇంటి మధ్యలోకి మారుస్తున్నారు. పైన ఉన్న ఇల్లు సింహద్వారానికి ఎదురుగా.. ఈ ప్రధాన ద్వారం వచ్చే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. అదేవిధంగా తన ఇంట్లో నుంచి జాగృతి కార్యాలయంలోకి వెళ్లడానికి కూడా ప్రత్యేక ద్వారాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ఆషాఢ మాసం పూర్తయి? శ్రావణమాసం వచ్చేలోపు ఈ వాస్తు మార్పులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు ఎమ్మెల్సీ కవిత. ఇప్పుడు తనకు మంచి జరగడం లేదని.. త్వరలో తనకు మంచి రోజులు రాబోతున్నాయని చెబుతున్నారు ఎమ్మెల్సీ కవిత. ఇంటి వాస్తు బాగా లేకపోవడం వల్లే ఇబ్బందుల పాలవుతుందని కవిత అనుచరులు కూడా అనుకుంటున్నారు. నిజంగా వాస్తు దోషమే కవితకు బ్యాడ్ డేస్ తీసుకొచ్చిందా.. తాజా మార్పులతో మళ్లీ ఆమె ట్రాక్‌లోకి వస్తారా..? లెట్స్ వెయిట్ అండ్ సీ.

# చిట్ చాట్ చిటపటలు

హైదరాబాద్, జూలై 19, తెలంగాణ రాజకీయాలకు చిట్‌చాట్ మంటలు అంటుకున్నాయి. గంజాయ్ బ్యాచ్ అంటూ అధికారపక్షం విపక్షాన్ని టార్గెట్ చేస్తుంటే? డైవర్ట్ రాజకీయాలు అస్సలొద్దు. దమ్ముంటే నిరూపించూ అంటూ విపక్షం అధికార పార్టీకి సవాల్ విసురుతోంది. అసలే తెలంగాణ రాజకీయాలు బనకచర్ల ఇష్యూతో భగభగ మండుతున్నాయి. ఇప్పుడు అగ్నికి ఆజ్యం అన్నట్లుగా చిట్‌చాట్ చిటపటలు కూడా అంటుకున్నాయి. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో మీడియా చిట్‌చాట్‌లో మాజీ మంత్రి కేటీఆర్ ను గంజాయి బ్యాచ్‌తో పోల్చడంతో వివాదం రాజుకుంది.కేటీఆర్ చుట్టూ ఉండే వాళ్లు డ్రగ్స్ తీసుకుంటారని, అతని మాటలను పట్టించుకోవాల్సిన అవసరం లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం దుమారం రేపింది. కేటీఆర్ స్నేహితుడు కేదార్ దుబాయ్‌లో డ్రగ్స్ తీసుకొని చనిపోయాడని, దానికి సంబంధించిన ఫోరెన్సిక్ నివేదికను కూడా తెప్పించినట్లు రేవంత్ చెప్పడంతో తెలంగాణ రాజకీయాల్లో అలజడి రేగింది. అంతేకాదు లోకేష్‌ను ఖుఫీ ఎందుకు రహస్యంగా కలిశారో చెప్పాలన్నారు రేవంత్. అర్ధరాత్రి లోకేష్‌తో డిన్నర్ మీటింగ్‌లు ఎందుకు చేశారని సమస్యల పరిష్కారం కోసం ఢిల్లీ వెళ్లడం తప్పా అని ప్రశ్నించారు రేవంత్మరోవైపు రేవంత్ రెడ్డి చిట్ చాట్ మాటలపై బీఆర్ఎస్ మండిపడింది. గంజాయి బ్యాచ్ ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తూ సవాల్ విసిరారు కేటీఆర్. డ్రగ్స్ కేసులు ఉంటే చూపించాలని, లై డిటెక్టర్ టెస్ట్‌కు సిద్ధమన్నారు కేటీఆర్. గతంలోతాను చేసిన వైట్ చాలెంజ్‌కు..రేవంతే పారిపోయాడని? అసత్య ఆరోపణలతో రేవంత్ ప్రజాసమస్యలను డైవర్ట్ చేస్తున్నారని ఆరోపించారు కేటీఆర్మరోవైపు మాజీ మంత్రి హరీష్ రావు రేవంత్ రెడ్డి చిట్‌చాట్ వ్యాఖ్యలపై తీవ్రంగా ధ్వజమెత్తారు. రేవంత్ బూతులతో ఢిల్లీ కాలుష్యం పెరిగిందని, కేటీఆర్ రాష్ట్ర గౌరవాన్ని అంతర్జాతీయంగా పెంచితే..సీఎం రేవంత్ బ్యాగ్‌లు మోసి తెలంగాణ పరువు తీసారంటూ విమర్శించారు. రేవంత్‌కు కంపల్సివ్ లై సిండ్రోమ్ ఉందని, రహస్య మంతనాలు రేవంత్‌కే సాధ్యమని విమర్శించారు. రేవంత్ బనకచర్లపై అడ్డంగా దొరికిపోయాడని, చర్చ జరిగిందని కేంద్ర మంత్రి నిమ్మల చెబుతుంటే? రేవంత్ తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు హరీశ్.రేవంత్ రెడ్డి చిట్‌చాట్ మంటలు తెలుగు రాష్ట్రాల రాజకీయాలను మరింత హీటెక్కించాయి. కేటీఆర్, లోకేష్ రహస్య సమావేశాల ఆరోపణలు బీఆర్ఎస్, టీడీపీ మధ్య సంబంధాలను హైలెట్ చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తుండగా? బనకచర్లపై తెలంగాణ సమాజాన్ని రేవంత్ తప్పుదోవ పట్టించేప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ రివర్స్ అటాక్‌కు దిగుతోంది. మొత్తానికి చిట్‌చాట్ రగడ తెలంగాణ రాజకీయాలను షేక్ చేస్తోంది.

# యూరియా.. ఏదయా...!

వైరా : ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే అన్నదాతలకు యూరియా కష్టాలు మొదలయ్యాయి. యూరియా ఎదయా అంటూ నిలదీతల పర్వం ప్రారంభమైంది. వైరా మండలంలోని పాలడుగు గ్రామంలో యూరియా కోసం రైతులు శనివారం ఉదయం ఆందోళనకు దిగారు. ఈ గ్రామంలోని సొసైటీకి సంబంధించిన గోదాము శిథిలావస్థకు చేరింది. దీంతో ఈ గోదాములో యూరియా నిల్వచేసే పరిస్థితి లేకుండా పోయింది. ఇటీవల ఈ గ్రామానికి మూడు లారీల యూరియా కేటాయించారని రైతులు చెబుతున్నారు. అయితే యూరియా నిల్వచేసే స్థలం లేదని ఆ మూడు లారీల యూరియాను పక్కనే వున్న గొల్లపూడి గ్రామానికి తరలించారని రైతులు పేర్కొంటున్నారు. తమ గ్రామం పేరుతో వచ్చిన యూరియాని గొల్లపూడి తరలించినప్పుడు తమకు కనీస సమాచారం ఇవ్వలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# హుస్నాబాద్ లో 'స్టీల్ బ్యాంక్'


కరీంనగర్, జూలై 19, సరికొత్త కార్యక్రమానికి పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ శ్రీకారం చుట్టింది. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను తగ్గించి దిశగా అడుగు వేసింది. స్టీల్ సామాగ్రి వాడకం తప్పని సరి చేసేలా వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. 276 మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ నిర్వహణ బాధ్యతలను అప్పగించింది. ప్లాస్టిక్?.. ప్రతి ఒక్కరి జీవితంలో విడదీయలేని భాగంగా మారిపోయింది. ఆహార పదార్థాలు, పానీయాలను ప్యాక్ చేయటం దగ్గరి నుంచి ప్రతి వస్తువు తయారీలోనూ దీన్ని వాడుతున్నారు. ఓవైపు ప్లాస్టిక్ తో అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నప్పటికీ? పరిస్థితుల్లో పెద్దగా మార్పులు రావటం లేదు. ముఖ్యంగా ఫంక్షన్ల వేళ? సింగిల్ యూజ్ ప్లాస్టిక్ తెగ వాడేస్తున్నారు. తద్వారా ఆరోగ్యానికి కాదు? పర్యావరణ సమస్యలు కూడా రెట్టింపువుతున్నాయి.రోజురోజూ ప్లాస్టిక్ కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో?. పొన్నం సత్తయ్య చారిటబుల్ ట్రస్ట్ సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్టీల్ సామాగ్రి వాడకం తప్పని సరి చేసేలా వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా హుస్నాబాద్ నియోజవర్గ పరిధిలోని 276 మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ నిర్వహణ బాధ్యతలను అప్పగించింది.ఇక నుంచి నియోజకవర్గ పరిధిలో జరిగే పెళ్ళిళ్ళు, శుభకార్యాల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను తగ్గించే దిశగా ముందుకెళ్లనున్నారు. వీటికి బదులుగా స్టీల్ సామాగ్రిని వాడేలా చర్యలు చేపట్టనున్నారు. ఈ స్టీల్ బ్యాంక్ లో?. టిఫిన్ ప్లేట్స్,లంచ్ ప్లేట్స్ ,వాటర్, టీ గ్లాస్ లు, కప్స్, డిష్ లు ,బకెట్లు , చెంచాలు ,వంటలకు అవసరమైన గిన్నెలు తదితర వస్తువులు అందుబాటులో ఉంటాయిప్లాస్టిక్‌కు బదులు స్టీల్ వాడకాన్ని ప్రోత్సహించే దిశగా ఈ స్టీల్ బ్యాంకులు పని చేస్తాయి. మంత్రి పొన్నం చేపట్టిన ఈ వినూత్న కార్యక్రమం ద్వారా ప్రజా ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజారోగ్యం దిశగా ఈ తరహా కార్యక్రమం చేపట్టడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు తెలుపుతున్నారుతెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గారికి స్వాగతం. హుస్నాబాద్ నియోజకవర్గం గ్రామీణ ప్రాంత నియోజకవర్గం. ఇక్కడ 160 గ్రామాలు ఉన్నాయి. 270 మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ పంపిణీ చేస్తున్నాం.. అందులో 500,400,300 కిట్స్ ఉన్నాయి. ఈ జిల్లా ఆదర్శంగా ఉండాలని స్టీల్ బ్యాంక్ పంపిణీ కార్యక్రమం చేపట్టాను. నా నియోజకవర్గంలో ఎవరూ అనారోగ్యం బారిన పడకుండా ఉండాలని స్టీల్ బ్యాంక్ పంపిణీ కార్యక్రమం చేపట్టాను" అని చెప్పుకొచ్చారు."340 హోటల్ లలో 3400 స్టీల్ గ్లాస్ లు పంపిణీ చేశాం. 74 వేల రైస్ ప్లేట్స్ ఈ నియోజకవర్గంలో పంపిణీ చేస్తున్నాం. నియోజకవర్గం ప్లాస్టిక్ రహితంగా ఉండాలని అధికారులను భాగస్వామ్యం చేస్తూ ప్లాస్టిక్ నిషేధించేలా స్టీల్ బ్యాంక్ పంపిణీ కార్యక్రమం చేపట్టాం. ప్లాస్టిక్ దూరం పెడితే మీరు అనారోగ్యాలను దూరం పెట్టినట్టే. నన్ను ఆశీర్వదించి గెలిపించిన మీకు అండగా ఉంటా. మట్టి పత్రాలు ప్రోత్సహించే విధంగా ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. ప్లాస్టిక్ వాడడం మంచిది కాదు అని ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు చూపించాలి" అని మంత్రి పొన్నం వివరించారు. ప్లాస్టిక్ ను దూరం పెడితేనే మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ప్లాస్టిక్ ను దూరం పెట్టేలా మంత్రి పొన్నం ప్రభాకర్ స్టీల్ బ్యాంక్ పంపిణీ కార్యక్రమం చేపట్టడం గొప్ప విషయమని ప్రశంసించారు. పర్యావరణాన్ని మనమే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు."ప్లాస్టిక్ తో మనకు ఇబ్బందులు వస్తాయి. కాన్సర్ తో పాటు ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కరోనా తరువాత ఆరోగ్యం మీద చాలా అవగాహన వచ్చింది. ఒకే సారి 70 వేల మంది తినేలా ఈరోజు స్టీల్ బ్యాంక్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. మన కంటే ముందు తరం వారు చాలా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకున్నారు. వారి చాలా ఆరోగ్యంగా ఉన్నారు" అని మంత్రి సురేఖ గుర్తు చేశారు."ప్లాస్టిక్ వందల సంవత్సరాలు భూమిలో కలిసిపోవు. భూమి ,నీటి కాలుష్యాన్ని చేస్తాయి. మురుగు నీరు వెళ్లకుండా అడ్డుపడుతుంటాయి. మీ ఆకలి తన ఆకలి అనుకొని సేవ చేసే వ్యక్తి పొన్నం ప్రభాకర్. వారి నాన్న పేరు మీద స్టీల్ బ్యాంక్ ఏర్పాటు చేస్తున్నారు. మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ పంపిణీ చేయటం దుర దృష్టితో ఆలోచించిన వ్యక్తి. ఇక నుండి ప్లాస్టిక్ మేము ముట్టుకోము అని మహిళలకు ప్రమాణం చేయాలి. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను మన జీవితంలో నుండి దూరం చేయాలి" అని మంత్రి కొండా సురేఖ కోరారు.

# కోట్లు కురిపిస్తున్న ఫోక్ సాంగ్స్...

## జానపదాల ఖిల్లా.. జగిత్యాల జిల్లా..

హైదరాబాద్, జూలై 19, యూట్యూబ్ రాకతో ప్రపంచమంతా తెలంగాణ జానపదం వినిపిస్తోంది. తెలంగాణ ఫోక్ సాంగ్స్ నేడు కోట్లాది మందిని ఆకట్టుకుంటున్నాయి. కళాకారులకు ఆదాయ వనరుగా, తెలంగాణ సంస్కృతికి చిహ్నాలుగా నిలుస్తున్నాయి. ఇది కళాకారులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో అవకాశాలు వచ్చేలా చేస్తోంది. దాదాపు రూ.2, 3 లక్షలతో చిత్రీకరించిన పాటలు.. కోట్ల రూపాయలు కురిపిస్తున్నాయి. ఇటీవల రాను బొంబాయికి రాను.. పాట యూట్యూబ్‌లో రికార్డు సృష్టించింది. 400 మిలియిన్ వ్యూస్ సొంతం చేసుకుని రూ.కోటి వరకు ఆదాయం తెచ్చిపెట్టినట్లు తెలుస్తోంది. పంట పొలాల్లో పని చేసుకుంటూ మాట్లాడే మాటలు.. ఉఛ్వాస నిశ్వాసలతో రాగాలుగా పరిమళించిన వేళ.. పక్షుల కిలకిల రావాలు, సెలయేళ్ల చప్పుళ్లు దరువులుగా మారిన సమయాన.. పల్లె పల్లవి కట్టి పాట పాడితే.. అవే జానపదాలు. చాలా భాషల్లో మొదటి సాహిత్యం జానపదాలే. అయితే, తెలంగాణకు మాత్రం అవి గుండెచప్పుడు అయ్యాయంటే.. అతిశయోక్తి కాదు. అన్యాయాన్ని ప్రశ్నించాలన్నా, మరదలితో చిలిపిగా మాట్లాడాలన్నా, ఓ పని చేసేముందు ఉత్సాహం ఉరకలెత్తాలన్నా పాట ఉండాల్సిందే. పెళ్లికీ, పేరంటానికీ తెలంగాణ పల్లెల్లో జానపదం మారుమోగాల్సిందే."బండెనక బండి గట్టి..", "రాజిగ ఓరి రాజిగా..", "పొడుస్తున్న పొద్దు మీద.." అంటూ పోరాటాలకు పాటల తూటాలు అందించడమే కాకుండా.. "ఒడ్డొడ్డు గడ్డిగోసి ఒడ్డు కింద పెట్టి.. ఒడ్డు నీడల తిరిగే వసుదేవుడేడే.. యాల రాడే నీలవరుడు.." అంటూ ప్రియుడి కోసం వెతుకుతున్న ప్రియురాలి సొకుమార్యాన్ని ప్రదర్శించింది తెలగాణ జానపదం. "రావణుడు మాయ రావణుడు.. కానీ దేశంబు పోయినాడు.. కానీ దేశంబు పోయి.. ముత్తెమంత (ముత్యం) సీతాను దెచ్చినాడు.." అంటూ పురాణాల జ్ఞానం తెలుపుతూనే..", "పాలోళ్లు పగోళ్లు... నా కొడక రత్నం రతనయ్య.. పగబట్టి చంపిరిరా.." అంటూ దాయాదుల క్రూరత్వాన్ని తల్లి తన కొడుకు కళ్లకు కట్టిన తీరును వివరించింది. "పాకాల చెరువులోనా నాథుడా, గోపాల పువ్వున్నది.. ఆ పువ్వే తేవాలయ్యో నాథుడా.. మన నోమే నోమాలయ్యో నాథుడా.." అంటూ భర్తను చంపేందుకు భార్య ఎలా వ్యూహం పన్నిందో.. సమాజంలో ఇలాంటి మసకబారిన మెదళ్లు ఎలా ఆలోచిస్తాయో చూపించింది. ఇలా తెలంగాణ పల్లె పాటల గురించి చెప్పుకుంటూ పోతే రోజులు తరగవు.టేప్ రికార్డర్లు వచ్చిన తర్వాతి సమయంలో ఈ జానపదాలు తెలంగాణ ప్రాంతమంతా వ్యాపించాయి. తెలంగాణ వచ్చిన తర్వాత ఈ పల్లె పాటలకు పునర్వైభవం వచ్చింది. బతుకమ్మ పాటలు, బావమరదళ్ల చిలిపి ప్రేమ పాటలు.. చాలా ప్రాచుర్యంలోకి వచ్చాయి. ఇక యూట్యూబ్ రాకతో ప్రపంచమంతటా తెలంగాణ జానపదం వినిపిస్తోంది.ఇప్పుడు తెలంగాణ ఫోక్ సాంగ్స్ సరికొత్త ట్రెండ్ సెట్ చేస్తున్నాయి. దేశంలోని ఇతర ప్రాంతాల్లో ప్రముఖ కార్యక్రమాల్లో (ఒడిశాలో ఓ కార్యక్రమంలో) దుమ్మురేపుతున్నాయి. ఇటీవల తెలంగాణలో జరిగిన మిస్ వరల్డ్ అందాల పోటీలు సహా క్రికెట్ మ్యాచ్‌ల్లోనూ తెలంగాణ జానపదాలు హైలైట్‌గా నిలిచాయి. యూట్యూబ్, సోషల్ మీడియాలోనూ ట్రెండింగ్‌గా మారుతున్నాయి. ఇలాంటి ప్రైవేట్ ఆల్బమ్స్‌కు మానిటైజేషన్‌తో కోట్ల రూపాయల్లో డబ్బులు వస్తుండటం గమనార్హం. అందుకు నిదర్శనమే ఇటీవల వచ్చిన "రాను బొంబాయికి రానూ.." పాట"రాను బొంబాయికి రానూ.." పాట యూట్యూబ్‌లో రికార్డులు సృష్టిస్తోంది. జనవరి 23న యూట్యూబ్‌లో విడుదలైన ఈ పాట.. 414 మిలియన్స్ వ్యూస్ సొంతం చేసుకుంది. అలా కేవలం రూ.3 లక్షల బడ్జెట్‌తో నిర్మించిన ఈ పాటకు యూట్యూబ్ ద్వారా దాదాపు రూ.1 కోటికి పైగా ఆదాయం వచ్చినట్లు తెలుస్తోంది. ఇక వ్యూస్‌ని బట్టి మరింత ఆదాయం పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. రాము రాథోడ్ ఈ పాటను అద్భుతంగా రాశారు. కళ్యాణ్ కీస్ మ్యూజిక్ ఇచ్చారు. సింగర్స్ ప్రభ, రాము కలిసి చాలా గ్రేస్‌తో పాట పాడారు.మొదట ఈ పాటను రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడలో షూట్ చేశారు. ఆ తర్వాత, క్లైమాక్స్‌కు మెరుగులు దిద్దాలని జగిత్యాలలో పలు ప్రాంతాల్లో తిరిగి చిత్రీకరించినట్లు సమాచారం. ఈ పాటకు డ్యాన్స్ మాస్టర్స్ మంచి మాస్ స్టెప్పులు కంపోస్ చేశారు.వెట్టిచాకిరికి వ్యతిరేకంగా1978లో జైత్రయాత్ర సాగించిన జగిత్యాల.. చారిత్రక ఉద్యమాలకే కాదు..

# చందునాయక్ మృతిలో కొత్త ట్విస్ట్...



హైదరాబాద్, జూలై 19, హైదరాబాద్ మలక్‌పేట్‌లోని సిపిఐ రాష్ట్ర నాయకుడు చందునాయక్ ను ఈనెల 15వ తేదీన శాలివాహన పార్క్ వద్ద తుపాకీతో కాల్చిచంపారు దుండగులు. బహిరంగ ప్రదేశంలో గన్ ఫైరింగ్ ను సీరియస్‌గా తీసుకున్న తెలంగాణ పోలీసులు కేసు విచారణను వేగవంతం చేశారు. చందునాయక్ హత్య కేసులో నిందితులను గాలించేందుకు 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. తాజాగా కీలక విషయాలు వెలుగుచూస్తున్నాయి. చందునాయక్ హత్య వెనుక వివాహేతర సంబంధం ఉందని మొదట్లో అనుమానించారు, కానీ వివాహేతర సంబంధ కారణం కాదని తాజా విచారణతో క్లారిటీకి వచ్చినట్లుగా తెలుస్తోంది. చందునాయక్ తో సన్నిహితంగా ఉండే మాజీ మావోయిస్టు రాజేష్ తో ఏర్పడ్డ విభేదాలే హత్యకు కారణమని భావిస్తున్నారు. కుంట్లూరు వద్ద ఉన్న భూమిలో పేదల గుడిసెలు ఏర్పాటు చేసేందుకు చందునాయక్ సహకరించాడు. అదే ప్రాంతంలో చందునాయక్ తోపాటు రాజేష్ సైతం గుడిసెలు ఏర్పాటు చేసుకోవడంతోపాటు, పేదలను బెదిరించి చందాలు ఏర్పాటు చేస్తున్నాడని గుర్తించిన చందునాయక్ ఇదే విషయాన్ని పార్టీ ముఖ్యనేతలకు పిర్యాదు చేశాడు. దీంతో రాజేష్ ను పార్టీ నేతలు మందలించినట్లుగా సమాచారం.పార్టీ నేతలకు తనపై ఫిర్యాదు చేయడంతోపాటు మామూళ్ల వసూళ్లకు చందునాయక్ అడ్డుపడుతున్నాడని భావించిన రాజేష్ కక్ష పెంచుకున్నాడు. చందునాయక్ ను హత్య చేసేందుకు వారం రోజులపాటు రెక్కీ నిర్వహించినట్లు సమాచారం. రాజేష్ తోపాటు అదే ప్రాంతానికి చెందిన తన సన్నిహితులు సుధాకర్, బాషా, శివతో పాటు మరో ఐదుగురు వ్యక్తులు ఈ హత్యకు సహకరించినట్లుగా తెలుస్తోంది. హత్యలో కీలకంగా వ్యవహరించిన మరో నిందితుడు ఏడుకొండలు కాల్ డేటాను పరిశీలించిన పోలీసులు మిగతా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. హత్య జరిగిన నాటి నుంచి యాదిరెడ్డి, రవిచంద్రాచారి పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది.కంట్లూరు గుడిసెల వివాదంలో రాజేష్ అండ్ గ్యాంగ్‌తో విభేదాలు తారాస్థాయికి చేరడంతో అంతా ఏకమై చందునాయక్ ను హతమార్చేందుకు కుట్రపన్నినట్లుగా తెలుస్తోంది. హత్యకు ముందురోజు రాత్రి నిందితుల ఫోన్లన్నీ స్విచ్ ఆఫ్ చేయడంతోపాటు హత్యకు ప్లాన్ చేసిన రోజున , ముందుగా ఇంటివద్దే చందునాయక్ ను కాల్చి చంపేందుకు సిద్దమయ్యారు. ఈ క్రమంలో ఇంటివద్ద రెక్కీ నిర్వహించారు. వీరిలో ప్రధాన నిందితుడైన మాజీ మావోయిస్టు రాజేష్ ను గమనించిన చందునాయక్ భార్య , ఇదే విషయాన్ని భర్తకు చెప్పింది. ఇంటి వద్ద రాజేష్ తిరుగుతున్నాడని, అయితే తనను పబ్లిక్ ప్లేస్ లో ఎవరేమీ చేయలేరని చెప్పిన చందునాయక్ లైట్ తీసుకున్నాడు. అయితే ఇంటి వద్ద హత్య చేసేందుకు అవకాశంలేక పోవడంతో వెనుక కారులో ఫాలో అయ్యారు. శాలివాహన పార్క్ వద్దకు చేరుకోగానే తుపాకీతో కాల్చి చంపి పారారయ్యారు. హత్యలో నలుగురు నిందితులు ప్రత్యక్షంగా పాల్గొంటే, మరో ఐదుగురు హత్యకు స్కెచ్ వేయడంతోపాటు ఎప్పటికప్పుడు చందునాయక్ కదలికలపై సమాచారం అందించేవారు. చందునాయక్ ను పార్క్ వద్ద తుపాకీతో కాల్చిన వెంటనే చనిపోయాడని నిర్ధారించుకుని అక్కడి నుంచి ఓక్యాబ్ లో ఉప్పల్ వరకూ వెళ్లిన నిందితులు, ఉప్పల్ నుంచి బస్సులో చౌటుప్పల్ వెళ్లినట్లుగా తెలుస్తోంది. క్యాబ్ డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు, డ్రైవర్ ఇచ్చిన సమాచారం ఆధారంగా నిందితుల కాల్ డేటా, సెల్ టైవర్ లొకేషన్, తప్పించుకున్న మార్గంలోని సీసీ కెమెరాలు పరిశీలిస్తున్నారు.

# కవిత ప్లాన్ ఏంటీ...

నిజామాబాద్, జూలై 19, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజకీయ భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలు పార్టీ శ్రేణుల్లో కలకలం సృష్టించాయి. దీంతో ఆధిపత్యపోరులో ఎవరి వైపు ఎవరుంటారనే చర్చ ప్రస్తుతం ఊపందుకుంది. బీసీ రిజర్వేషన్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం జారీచేసిన ఆర్డినెన్స్ ను సమర్థిస్తూ సంబరాలు చేసుకోవడం, దాన్ని ప్రశ్నిస్తూ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన దుమారం, ఆవిషయంలో పార్టీ తనకు మద్దతు ఇవ్వకోవడంపై ఆమె నర్మగర్భ వ్యాఖ్యలు చేయడంతో పరిస్థితి ఇంకా ముదిరింది. అయితే తాను పార్టీలో ఉండలేక, మరో పార్టీలో చేరలేక, కొత్త పార్టీ పెట్టలేక అంతర్గత మథనం కొనసాగుతోంది.తెలంగాణ ఉద్యమంలో టీఆర్ఎస్ పార్టీకి అనుసంధానంగా ఏర్పాటు చేసిన తెలంగాణ జాగృతి పేరుతో సాంస్కృతిక భూమిక నిర్వహించారు. తదనంతరం కేటీఆర్ రాజకీయ రంగప్రవేశంతో పార్టీలో తన ప్రాభవం తగ్గినట్లు భావిస్తున్నారు. పార్టీ ప్రధాన నిర్ణయాల్లో ప్రముఖ పాత్ర నిభాయించిన ఆమె తండ్రి ఇచ్చిన బలంతో ఎదురులేని శక్తిగా పార్టీలో ఎదిగారు. పార్టీ పరిస్థితుల గురించి గ్రౌండ్ రియాలిటీస్ తెలిసిన కవిత కు పెద్దాయన కేసీఆర్ ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవారని చెబుతారు. అయితే రెండో టర్మ్ ఎన్నికల సందర్భంగా తిరిగి పోటీ చేసిన కవిత అదే పార్లమెంట్ పరిధిలో ఓటమి చవిచూడడం పార్టీలో ప్రాధాన్యత విషయంలో వెనుకబడ్డారు. ఆ సమయంలో కేటీఆర్ వర్గం ఆయన్ను ముఖ్యమంత్రి చేసే అవకాశాలున్నాయని అంతర్గతంగా ప్రచారం చేయడం. మీడియా కూడా ఆ విషయాన్ని హైప్ చేయడంతో దాదాపు నెల రోజుల పాటు అంతర్గతంగా పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు పార్టీ శ్రేణుల అభిప్రాయాన్ని సేకరించే పనిలో పడిన కేసీఆర్ ఒక్కసారిగా యూటర్న్ తీసుకొని ప్రచారానికి ఫుల్ స్టాప్ పెట్టాలని, ఎవరు ఈ విషయంపై మాట్లాడినా చర్యలు ఉంటాయని హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. అయితే ఈ విషయంలో కవిత, కేసీఆర్ ను ప్రభావితం చేసి ఉండవచ్చని కూడా కథనాలు వెలువడ్డాయి. కేటీఆర్ ఆ సమయంలో సీఎం కాకుండా అడ్డుగా నిలిచింది కవితనే అని కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరిగింది. కవిత మొదటిసారి నిజామాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి గెలిచిన తరువాత ఆ పార్లమెంట్ పరిధిలో ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు ఆమెకుఏర్పడిన తరువాత మద్దతుగా నిలిచారు. ఆ తరువాత పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ను నియమించి పార్టీ పగ్గాలు పగ్గాలు అప్పగించడం, ఆ తరువాత ఎన్నికలో పార్టీ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే.అయితే ఎంపీ ఎన్నికల్లో తన ఓటమికి పార్టీ నాయకులే కారణమని అనుచర, సహచర వర్గాలతో వ్యాఖ్యానించడం. తరువాత లిక్కర్ కేసులో ఉచ్చు బిగుసుకొని జైలు పాలవ్వడంతో జరిగింది. అయితే జైలు నుంచి తిరిగి వచ్చిన తరువాత కవిత మౌనంగా ఉంటుందని భావించారు.

# యాక్టింగ్ సీఎం... అసలు ఎప్పుడు



విజయవాడ, జూలై 19,ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి త్వరలో తన క్యాబినేట్ సహచరులతో కలిసి సింగపూర్ పర్యటనకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో పాలన పగ్గాలను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు అప్పగించబోతున్నట్టు వార్తలు వచ్చాయి. సోషల్ మీడియాలో ఓ వర్గం వాళ్లు దీన్ని తెగ ప్రచారం నిర్వహించారు. దీనిపై కూటమి ప్రభుత్వం క్లారిటీ ఇచ్చింది. ఏపీలో పొత్తులో ఉన్న తెలుగు దేశం, జనసేన మధ్య చీలిక తీసుకురావడానికి వైసీసీకి చెందిన కొంత మంది నేతలు వీటిని వ్యూహాత్మకంగా ప్రచారం చేసారని చెబుతున్నారు. ఇద్దరి మధ్య చిచ్చు రాజేసి అందులో చలిమంటలు కాచుకునే వ్యూహంతోనే ఈ ప్రచారానికి వైసీపీ తెర లేపిందని చెబుతున్నారు. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పలు దేశాలతో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంగా వివిధ దేశాల్లో పర్యటిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఎపుడు తన బాధ్యతలను వేరే వాళ్లకు అప్పగించిన దాఖలాలు లేవు. ఇలా వేరే వాళ్లు ఇంఛార్జ్ ప్రైమ్ మినిస్టర్, ఇంఛార్జ్ ముఖ్యమంత్రులనేవి రాజ్యాంగంలో లేవు.ఒకవేళ ప్రధాని గానీ, ముఖ్యమంత్రి కానీ.. తమకు వీలు లేనపుడు తమకు సంబంధించిన ఫైల్స్ క్లియర్ చేయమని తమ క్యాబినేట్ సహచరుల్లో ఎవరికైనా ఒకరికి బాధ్యతలు అప్పగించవచ్చు. కేవలం గవర్నర్ ను తెలిగిస్తే.. మాత్రమే వేరే వాళ్లకు ఇంఛార్జ్ గవర్నర్ పదవులను అప్పగించడం అనేది రాజ్యాంగంలో ఉంది. ఇక చంద్రబాబు నాయుడు, వైయస్ జగన్మోహన్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి గానీ.. మాజీ సీఎం కేసీఆర్ కానీ విదేశీ పర్యటనలకు వెళ్లినపుడు ఎక్కడా ఇంచార్జ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు అప్పగించిన దాఖలాలు లేవు. అక్కడి నుంచే ఆన్ లైన్ లోనే సమీక్షలు నిర్వహించేవారని గుర్తు చేస్తున్నారు. అయితే ఉప ముఖ్యమంత్రులను గౌరవించడంలో చంద్రబాబే తర్వాతే ఎవరైనా అని టీడీపీ, జనసేన శ్రేణులు చెబుతున్నాయి. గతంలో కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాల్లో చాలా మంత్రి డిప్యూటీ సీఎంలుగా పనిచేసినా.. వారి ఫోటోలను ఎక్కడా ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రదర్శించని దాఖలాలు లేవు. కానీ చంద్రబాబు నాయుడు మాత్రం తన ఫోటోతో పాటు డిప్యూటీ సీఎం ఫోటోలను ఉంచారనే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. అయితే వైసీపీ నేతల మాత్రం చంద్రబాబు నాయుడు ఏ దిక్కు లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పవన్ ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో ఉంచుతున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావిస్తున్నారు. అయితే రాజ్యాంగం ప్రకారం సీఎం అందుబాటులో లేనపుడు తన క్యాబినేట్ లో ఓ మంత్రికి ఇంఛార్జ్ బాధ్యతలు అప్పగించవచ్చు. ఇది పూర్తిగా సీఎం విచక్షణ అధికారంపై ఆధారపడి ఉంటుంది. ఒకవేళ పవన్ కళ్యాణ్ కు బాధ్యతలు అప్పగించాలనుకుంటే చంద్రబాబు ఇంఛార్జ్ సీఎంగా ఆయన్ని నియమించవచ్చు. రాజ్యాంగంలో ఉప ముఖ్యమంత్రి పదవి లేదు. క్యాబినేట్ పదవిలో భాగంగా ఏర్పడిన పదవి మాత్రమే. అయితే ముఖ్యమంత్రి ఇతర దేశాలకు వెళ్లినపుడు కానీ.. ఆయన ఆరోగ్యం బాగాలేపుడు తన క్యాబినేట్ సహచరులుకు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి.పవన్ ఏపీ సీఎం' ఇప్పుడిదే

## ట్రెండింగ్ లో పవన్

ట్రెండింగ్.. ఏ వెబ్ సైట్ చూసినా.. ఏ సోషల్ మీడియా ఓపెన్ చేసినా పవన్ సీఎం అంటూ హోరెత్తిస్తున్నారు. సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానెల్లు, కొన్ని మీడియా వెబ్‌సైట్లు "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తాత్కాలికంగా ముఖ్యమంత్రి బాధ్యతలు స్వీకరిస్తున్నారు" అనే ప్రచారాన్ని చేస్తున్నాయి. జనసేన అభిమానులు ఈ వార్తను ఆనందంగా పంచుకుంటూ, "మన కలలు నెరవేరాయి" అంటూ పోస్టులు చేస్తున్నారు. అయితే, ఈ వార్తకు ఉన్న ఆధారాలు ఏమిటి? వాస్తవం ఏమిటి? అసలు ఇది సాధ్యమేనా? అన్నది ప్రశ్న.డిప్యూటీ సీఎం హోదాలో ఉన్న పవన్ కల్యాణ్ తాత్కాలికంగా సీఎంగా బాధ్యతలు తీసుకోనున్నారంటూ పలు సోషల్ మీడియా ఖాతాలు ప్రచారం ప్రారంభించాయి. కొన్ని యూట్యూబ్ ఛానెల్‌లు దీనిని "బ్రేకింగ్ న్యూస్"గా ప్రసారం చేశాయి. దీని మీదే ఆధారపడి జనసేన అభిమానులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. ఇది చంద్రబాబు వ్యూహమేనా? లేక ఎవరో మంట పెట్టే ప్రయత్నమా? అన్నది అందరికీ డౌట్ కొడుతోంది. ఈ ప్రచారం గమనిస్తే, ఇది ఒక రాజకీయ మాయాజాలంగా కనిపిస్తోంది. చంద్రబాబు విదేశీ పర్యటనకు వెళు తున్న నేపథ్యంలో ఆ సమయంలో పవన్‌ను తాత్కాలికంగా సీఎం చేస్తారన్న ఊహాగానాలు వ్యాప్తి చెందడం, టీడీపీ–జనసేన మధ్య అపోహలు కలిగించాలన్న కుట్రగా అనిపిస్తోంది. చంద్రబాబు రాజకీయంగా ఎంత అప్రమత్తుడో అందరికీ తెలిసిందే.

# ట్రాఫిక్ కష్టాలకు ఏఐ చెక్

విశాఖపట్టణం, జూలై 19, విశాఖపట్నంలో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేందుకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ సరికొత్త ఆలోచనతో ముందుకొచ్చింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో పనిచేసే 'సారథి' వ్యవస్థను పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించింది. ముఖ్యమైన కూడళ్లలో దీనిని పరిశీలించనున్నారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రమాదాల నివారణ, ఉల్లంఘనలు తగ్గించడంలో సహాయపడుతుందిఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్.. అదేనండీ కృత్రిమ మేధ. మనిషి మెదడు నుంచి ఉద్భవించిన గొప్ప ఆలోచన.. కత్తికి రెండువైపులా పదును ఉన్నట్లు ఏఐతో కూడా లాభాలతో పాటే నష్టాలు కూడా ఉన్నాయని నిపుణులు చెప్తుంటారు. నష్టాల సంగతి పక్కనబెడితే ఏఐ సాయంతో ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టాలని గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) సరికొత్త ఆలోచన చేస్తోంది. విశాఖపట్నంలో ట్రాఫిక్ నియంత్రణకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో పనిచేసే (సిస్టమేటిక్ ఆగ్మెంటెడ్ రేడియల్ ట్రాఫిక్ అండ్ హూప్ ఇండక్షన్) సింపుల్‌గా చెప్పాలంటే సారథి అనే వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది. పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని ప్రారంభించినట్లు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఓ ప్రకటనలో వెల్లడించింది.ట్రాఫిక్ పోలీసుల సహకారంతో పైలెట్ ప్రాజెక్టుగా ఈ సారథిని జీవీఎంసీ అమలు చేయనుంది. ఐదు ప్రైవేట్ టెక్ కంపెనీల సాయంతో ముఖ్యమైన కూడళ్ల వద్ద సారథి విధానాన్ని పరీక్షించనున్నారు. ఏఐతో పనిచేసే సారథి వ్యవస్థలో ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్, రెడ్ లైట్ వయెలేషన్ డిటెక్షన్, ఫేసియల్ రికగ్నిషన్ సిస్టమ్ వంటి సాంకేతికతలు అందుబాటులో ఉన్నాయి. పైలెట్ ప్రాజెక్టు కింద ఒక నెల పాటు విశాఖలో ఈ విధానాన్ని అమలు చేయనున్నారు. ట్రాఫిక్ రాకపోకల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నియమాల ఉల్లంఘనలు తగ్గించడం, టెక్నాలజీ సాయంతో స్మార్ట్ గవర్నెన్స్ అందించడం ఈ సారథి ముఖ్య ఉద్దేశాలని జీవీఎంసీ వెల్లడించింది. నెల రోజుల పరిశీలన తర్వాత.. వివిధ అంశాలపై నివేదిక తయారు చేసి.. ఆ ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారు.మరోవైపు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మంగళవారం పారిశుధ్య పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక సూచనలు చేశారు. పారిశుధ్య కార్మికుల పనితీరును ప్రతి ఉదయం క్షేత్రస్థాయిలో పరిశీలించాలని.. ప్రతి క్లాప్ వాహనం మూడు ట్రిప్పులు వేయడం తప్పనిసరని స్పష్టం చేశారు. చెత్త సేకరణ సమయంలో మైక్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని.. కంపాక్టర్ బిన్ల స్థానాలు మారుస్తూ ఉండాలని ఆదేశించారు

# విశాఖలో గ్లాస్ బ్రిడ్జి

విశాఖపట్టణం, జూలై 19, ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటకానికి ప్రత్యేక స్థానం ఉంది. అటు శ్రీకాకుళం నుంచి ఇటు అనంతపురం వరకు రోజుల తరబడి చూసి ఎంజాయ్ చేసే పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుటోంది. అలాంటి అప్‌గ్రేడేషన్ ప్రక్రియలో వైజాగ్‌లో గ్లాస్ వంతెన పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ ఆగస్టు 15 నాటికి పర్యాటకులకు కొత్త అనుభూతిని మిగల్చేందుకు సిద్ధమవుతోంది టూరిజం డిపార్టమెంట్. వైజాగ్ అంటే అందమైన బీచ్ మొదట గుర్తుకు వస్తుంది. తర్వాత కైలాసగిరి ఇలా ప్రతి ప్రదేశం మనల్ని మైమరిచిపోయేలా చేస్తాయి. ఇప్పుడు మరో స్పెషల్ అట్రాక్షన్ ఇందులో చేరింది. కైలాసగిరిలో ఏర్పాటు అవుతున్న గాజు వంతెన విశాఖకు మరింత హంగును తీసుకురానుంది. విశాఖపట్నం వెళ్లిన వాళ్లు బీచ్, కైలాసగిరికి వెళ్లిరాకుండా వారి టూర్ కంప్లీట్ కాదు. అందుకే ఆ ఆసక్తిని మరో ఎత్తుకు తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా గ్లాస్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. కైలాసగిరి హిల్‌టాప్ అంటే టైటానిక్ వ్యూపాయింట్ సమీపంలో ఈ గాజు వంతెన నిర్మిస్తున్నారు. దీని పొడవు సుమారు 50 మీటర్లు ఉంటుంది. అంటే 167 అడుగులు అన్నమాట. పూర్తిగా పారదర్శక గాజుతో కూడిన కాంటిలివర్ టెక్నాలజీ ఆధారంగా నిర్మిస్తున్నారు. ఇది పూర్తి అయ్యి అందుబాటులోకి వస్తే దేశంలోనే అతి పెద్ద గాజు వంతెనగా రికార్డు సృష్టించబోతోంది. దీని కోసం ఆరు కోట్లు ఖర్చు చేస్తున్నారు. దీనికి మరిన్ని డ్వెంచ్‌లను జోడించేందుకు మరో రెండు కోట్లు అదనంగా ఖర్చు పెడుతున్నారు.ది పూర్తి అయితే దీనిపై నడిచి విశాఖ అందాలను చూడొచ్చు. పూర్తిగా ట్రాన్స్‌పరెంట్ ఉండేలా ఏర్పాటు చేస్తున్నారు. భద్రతపరంగా కూడా చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. దీనిపై ఒకసారి 40 మంది వరకు నడవచ్చు. ఈ బ్రిడ్జిపై నడుస్తూ సముద్రతీరం, బీచ్‌లైనింగ్, హర్షవర్ధన గిరి, సిటీని చూడవచ్చు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ గాజు వంతెన ఏర్పాటు చేస్తున్నారు. బిల్డింగ్ కోడ్, టెన్షన్ టెస్ట్, హైటెక్ బోల్టింగ్ వంటివి అమలు చేస్తున్నారు. సాహసోపేతమైన గేమ్స్ ఇష్టపడే వాళ్లకు జిప్‌లైన్, స్కైసైక్లింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. జిప్ లైన్ 150 మీటర్ల పొడవు ఉంటుంది. దీనికి అనుబంధంగానే స్కైసైక్లింగ్ రెడీ అవుతుంది. గత ఏడాది నవంబర్‌లో పనులు మొదలు అయ్యాయి. ఈ వేసవికి అందుబాటులోకి తీసుకురావాలని చూశారు. కానీ అనుకున్నంత వేగంగా పనులు సాగలేదు. ఇప్పుడు ఆగస్టు 15 నాటికి పనులు పూర్తి చేసి నగర ప్రజలకు పర్యాటకులకు అందివ్వాలని చూస్తున్నారు.

# అచ్చెన్నకు వరుస కష్టాలు



శ్రీకాకుళం, జూలై 19, కింజారపు కుటుంబం అంటే సిక్కోలు జిల్లాలో తిరుగులేదు. ఇప్పుడు ఆ కుటుంబం నుంచి ఒకరు రాష్ట్రమంత్రిగా, మరొకరు కేంద్ర మంత్రిగా ఉన్నారు. కేంద్ర మంత్రిగా కింజారపు రామ్మోహన్ నాయుడు పౌరవిమానయాన శాఖను చేపట్టారు. యువకుడు కావడంతో ఆయనకు ఢిల్లీలో చంద్రబాబు కీలక బాధ్యతలను అప్పగించారు. అతి చిన్న వయసులో కేంద్ర మంత్రి అయిన రామ్మోహన్ నాయుడు మంచి పేరు సంపాదించుకున్నాడు. అయితే ఇటీవల అహ్మదాబాద్ లో జరిగిన విమాన ప్రమాదం ఘటనతో కొంత ఇబ్బంది పడినా ఆయన పనితీరు విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు లేవు. రామ్మోహన్ నాయుడుకు తెలుగుదేశం పార్టీలోనూ మంచి ప్రయారిటీ లభిస్తుంది...సైకిల్ తో సమానంగా వ్యవసాయశాఖ కావడంతో... అయితే ఇదే సమయంలో రామ్మోహన్ నాయుడు బాబాయి అచ్చెన్నాయుడు మాత్రం మంత్రిపదవిలో ఉన్నా ఆనందం మాత్రం లేదు. అచ్చెన్నాయుడు వ్యవసాయ శాఖ మంత్రిగా ఉండటమే ఇందుకు కారణం. అందరు మంత్రులదీ ఒక ఎత్తు. అచ్చెన్నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న వ్యవసాయ శాఖ మరొక ఎత్తు. నిరంతరం ఏదో ఒక సమస్య అచ్చెన్నాయుడును శాఖాపరంగా వెంటాడుతూనే ఉంది. ఇబ్బందులు పెడుతూనే ఉన్నాయి. క్షణం తీరిక లేకపోయినా ఏదో ఒక సమస్య మెడకు వచ్చి చుట్టుకుంటుంది. ఒక సమస్య నుంచి బయటపడ్డామని భావించే లోపు మరొక సమస్య వచ్చి పడుతుండటంతో అచ్చెన్నాయుడుకు ఊపిరిసలపకుండా చేస్తున్నాయనే చెప్పాలి. సహజంగా హోం మంత్రికి కొన్ని ఇబ్బందులుంటాయి. కానీ అదేమి విచిత్రమో కానీ ఈ ఏడాదికాలంలోనే వ్యవసాయ శాఖ మంత్రికి వచ్చినన్ని కష్టాలు ఏ శాఖకు రాలేదంటే అది అచ్చెన్న దురదృష్టమేనని సొంత పార్టీ నేతలే అంటున్నారు. వ్యవసాయ శాఖలో మంత్రిగా ఉన్న అచ్చెన్నాయుడు పనితీరుపైన కూడా ఇవి ప్రభావం చూపే అవకాశముందంటున్నారు. పొగాకు, మిర్చి, మామిడి పంటలకు సరైన గిట్టుబాటు రాకపోవడంతో రైతులు రోడ్డెక్కారు. దీంతో విపక్షనేత వైఎస్ జగన్ మూడు చోట్లకు మిర్చి రైతులను గుంటూరులోనూ, పొగాకు రైతులను పొదిలిలోనూ, మామిడి రైతులను చిత్తూరులోనూ పరామర్శించారు. దిగుబడి ఈ ఏడాది ఎక్కువ కావడంతో గిట్టుబాటు ధరలు లభించడం లేదని ప్రభుత్వం చెబుతోంది.ఢిల్లీ చేరుకున్న సిట్ టీం ఖరీఫ్ ప్రారంభం కావడంతో... ఖరీఫ్ సాగు ప్రారంభమయిన నేపథ్యంలో రైతులు అన్ని పంటలను వేశారు. దీనికి తోడు నైరుతి రుతుపవనాలు ముందుగానే ప్రవేశించినా వానలు కూడా పడకపోవడంతో సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. వేసిన పంటలు కూడా నీరు అందక ఎండిపోయే పరిస్థితికి వచ్చింది.దీం తో పాటు యూరియా దొరక్క రైతులు రోడ్డెక్కుతున్నారు. యూరియా కొరత కారణంగా రైతులు రైతుసేవా కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మరొక వైపు అన్నదాత సుఖీభవ పథకం డబ్బులు కూడా జమ కాకపోవడంతో మొత్తం మీద అచ్చెన్న శాఖ అస్తవ్యస్థంగా మారిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.

# మామిడి రైతులకు రూ.260కోట్లు

తిరుపతి, జూలై 19, (ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మామిడి రైతులకు శుభవార్త అందించారు. తోటాపురి మామిడి మార్కెట్‌లో నెలకొన్న సంక్షోభం కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సీఎం ఆదేశాల మేరకు మామిడి రైతుల సంక్షేమం కోసం రూ. 260 కోట్లను విడుదల చేసింది.ఈ నిధులతో రాష్ట్రవ్యాప్తంగా 6.5 లక్షల మెట్రిక్ టన్నుల తోటాపురి మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేయనున్నాయి. దీనికి గాను రోజుకు రూ. 4 సబ్సిడీని ప్రభుత్వం అందిస్తుంది. ఈ నిర్ణయం మార్కెట్‌లో ధరలు పడిపోవడంతో నష్టపోయిన రైతులకు గణనీయమైన ఊరట లభించనుంది. ముఖ్యంగా చిత్తూరు జిల్లాలో వేలాది మంది రైతులు ఈ సబ్సిడీ ద్వారా లబ్ధి పొందనున్నారు.రైతులకు అందే సబ్సిడీ నిధులను ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది. రైతులు తమ ఖాతాల వివరాలను తనిఖీ చేసుకోవాలని అధికారులు సూచించారు. మద్దతు ధరతో పాటు ఈ ప్రత్యక్ష నిధుల



జమతో రైతుల ఆర్థిక భారం తగ్గుతుందని ప్రభుత్వం విశ్వాసం వ్యక్తం చేస్తోంది.ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరమని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ధరల స్థిరీకరణ పథకం కింద పూర్తి మద్దతు ఇవ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి చేసింది. రైతుల నష్టాలను నివారించేందుకు కేంద్రంతో సంప్రదింపులు కొనసాగుతున్నాయి.రాష్ట్ర వ్యవసాయ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, తోటాపురి మామిడి కొనుగోళ్లు ఆగస్టు 2025 వరకు కొనసాగుతాయి. ప్రాసెసింగ్ సంస్థలు కనీసం రూ. 8 నుంచి రూ. 12 వరకు మద్దతు ధరగా చెల్లించాలని ప్రభుత్వం సూచించింది. దీనివల్ల రైతులకు మరింత మెరుగైన ఆదాయం లభించనుంది.ఈ నిర్ణయంతో రైతులకు పెద్ద ఊరటనిచ్చిన చంద్రబాబు ప్రభుత్వం, రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం చేసింది. ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతూ, ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

# ఆంధ్రప్రదేశ్ డ్రోన్ మార్ట్ పోర్టల్

విజయవాడ, జూలై 19, ఏపీ సర్కార్ సరికొత్త సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆంధ్రప్రదేశ్ డ్రోన్ మార్ట్ పోర్టల్ ప్రారంభించింది. ఈ పోర్టల్ ద్వారా వివిధ రకాల డ్రోన్ సేవలను అందిచనుంది. వ్యవసాయం,న్రాఖ్ఖ, విపత్తు నిర్వహణ వంటి అంశాల్లో ఈ సేవలు ఉపయోగపడనున్నాయి. టెక్నాలజీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం.. డ్రోన్ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకు సంబంధించి ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ను సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించారు.డ్రోన్ మార్ట్ ద్వారా వ్యవసాయం సహా వివిధ రంగాల్లో డ్రోన్ల ద్వారా సేవలు పొందేందుకు పోర్టల్‌ను ఏపీ డ్రోన్ కార్పొరేషన్ రూపొందించింది. ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ద్వారా వ్యవసాయం,న్రాఖ్ఖ, విపత్తు నిర్వహణ వంటి అంశాల్లో ఈ పోర్టల్ ద్వారా సేవలు పొందవచ్చు. రైతులు తమ పొలాల్లో మందులు పిచికారీ చేయాలంటే డ్రోన్లు వినియోగిస్తున్నారు. డ్రోన్ల ద్వారా పంటల పర్యవేక్షణ కూడా చేపట్టవచ్చు. ఇలాంటి సేవలను పోర్టల్ ద్వారా సాధారణ రైతులూ వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం ఇప్పుడు అందరికీ కల్పిస్తోంది.డ్రోన్లతో టెక్నాలజీని వినియోగించుకుని సర్వేలు చేపట్టడం, పెద్దఎత్తున పనులు చేపట్టే సందర్భంలో డ్రోన్లతో పర్యవేక్షించడం, సెక్యూర్టీ, మ్యాపింగ్ వంటి సేవలు డ్రోన్ల ద్వారా చేపట్టవచ్చు. ఈ తరహా సేవలను ఇకపై డ్రోన్ మార్ట్ ద్వారా పొందవచ్చు. డ్రోన్ మార్ట్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అందుబాటులోకి తెచ్చారు.డ్రోన్ సేవలు అవసరమైన వారికి సర్వీస్ ప్రొవైడర్లను డ్రోన్ మార్ట్ పోర్టల్ అందుబాటులోకి తెస్తుంది. ప్రభుత్వ విభాగాలను.. వివిధ సంస్థలను.. సర్వీస్ ప్రొవైడర్లను ఈ పోర్టల్ అనుసంధానం చేస్తుంది. సర్వీస్ ప్రొవైడర్లతో కస్టమర్లు సర్వీస్ ఛార్జీలపై సంప్రదింపులు జరిపే అవకాశం ఉంటుంది.

# 60 నియోజకవర్గాల్లో జనసేన పార్టీ ప్లాన్

విజయవాడ, జూలై 19, జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకూ తనకు కేటాయించిన శాఖపై దృష్టి పెట్టిన పవన్ కల్యాణ్ ఇక పార్టీపై కూడా ఫోకస్ పెట్టాలని నిర్ణయించారు. పార్టీని బలోపేతం చేసే దిశగా పవన్ కల్యాణ్ అడుగులు ఇకపై ఉండనున్నాయని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో 21 అసెంబ్లీ స్థానాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో పోటీ చేసి హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ సాధించారు. అయితే వచ్చే ఎన్నికలకు ఇప్పటి నుంచే జనసేన శ్రేణులను సిద్ధం చేసేందుకు జనసేనాని సిద్ధమవుతున్నట్లు సిద్ధమవుతుంది. ఇప్పటివరకూ గ్రామీణాభివృద్ధి, అటవీ శాఖ లపై పూర్తి స్థాయి పట్టు సాధించిన పవన్ కల్యాణ్ ఇక పార్టీని కూడా బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. పవన్ కల్యాణ్ ఎన్నికలకు ముందు నుంచి అగ్రిమెంట్లు చేసుకున్న సినిమాల షూటింగ్ లు కూడా దాదాపుగా పూర్తి కావచ్చాయి. వచ్చే నెలలో సినిమాల నుంచి కూడా పవన్ ఫ్రీ అవుతారు. దీంతో ఆయన ఇక పార్టీపై దృష్టి పెట్టి అత్యధిక నియోజకవర్గాల్లో ఒంటరిగా బలం పెంచుకుందామని డిసైడ్ అయ్యారు. కూటమిలో ఉంటూనే పార్టీని బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తున్నారు. వచ్చే ఎన్నికల నాటికి 175 నియోజకవర్గాల నుంచి 225 నియోజకవర్గాలకు పెరుగుతుండటంతో జనసేన పొత్తులో భాగంగా పోటీ చేసే స్థానాల సంఖ్య కూడా పెరుగుతుంది. కనీసం ఈసారి అరవై స్థానాల్లో పోటీ చేయడానికి ఆయన సిద్ధమవుతున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది ఇందుకోసం సెప్టంబరు నెల నుంచి పార్టీ పై ఫోకస్ పెట్టాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయ్యారు. ప్రస్తుతం గెలిచిన 21 నియోజకవర్గాలతో పాటు మరో అరవై నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేసే దిశగా నిర్ణయాలు ఉంటాయని అంటున్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఇన్ ఛార్జులను నియమించకుండా సర్వే ద్వారా ఎంపిక చేసిన కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే ఇన్ ఛార్జులను నియమించి అక్కడ పార్టీని బలోపతేం చేసి, శ్రేణులతో తరచూ సమావేశాలు నిర్వహించాలని పార్టీ శక్తిని మరింత పెంచుకోవాలని చూస్తున్నారు. జనసేన పార్టీని విస్తృతం చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో జగన్ పార్టీని అధికారంలోకి రానివ్వకుండా చేసేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధమవుతున్నారు జనసేనాని. అరవై నియోజకవర్గాల్లో ఇప్పటికే పవన్ కల్యాణ్ సర్వే చేయించినట్లు తెలిసింది. అందులో యాభై నియోజకవర్గాల్లో జనసేన బలంగా ఉన్నట్లు తేలింది. ఆ యాభై నియోజకవర్గాల్లో కొంచెం కష్టపడితే ఖచ్చితంగా గెలవవచ్చన్న భావనతో పవన్ కల్యాణ్ ఉన్నారు. అక్కడ సామాజికవర్గంతో పాటు యువత, అభిమానుల సంఖ్య కూడా ఎక్కువగా ఉండటంతో పాటు టీడీపీ, బీజేపీ కలిస్తే తమ గెలుపు ఖాయమని నమ్ముతున్నా?. సెప్టంబరు నెల నుంచి ఇంటింటికీ జనసేన కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో యాభై నియోజకవర్గాలకు ముందుగానే ఇన్ ఛార్జులను నియమించాలని భావిస్తున్నారు. నమ్మకమైన, నీతినిజాయితీ లున్న వారిని ఇన్ ఛార్జులుగా ఎంపిక చేయడంతో పాటు అక్కడ పర్యటించేందుకు కూడా పవన్ కల్యాణ్ ప్లాన్ చేసుకుంటున్నారని తెలిసింది.

# వేసవిలో చెరకు రసం తాగుతున్నారా? ఒక్కసారి ఇవి తెలుసుకోండి మీకే మంచిది!



వేసవి వచ్చిందంటే చాలు, ఎండవేడిమి, ఉక్కపోతలతో శరీరం డీహైడ్రేషన్ బారిన పడే ప్రమాదం ఉంటుంది. ఈ సమయంలో శరీరాన్ని చల్లబరచడానికి, కోల్పోయిన శక్తిని తిరిగి పొందడానికి అనేక రకాల పానీయాలను ఆశ్రయిస్తాం. వాటిలో అత్యంత సహజమైన, రుచికరమైన, సులభంగా లభించే పానీయం ఏదైనా ఉందా అంటే అది నిస్సందేహంగా చెరకు రసం. ఐస్ ముక్కలు, నిమ్మరసం, కొద్దిగా అల్లం కలిపిన చల్లని చెరకు రసం గొంతులోకి వెళ్తే ఆ వేసవి తాపం ఇట్టే మాయమైపోతుంది. కేవలం రుచి కోసమే కాదు, చెరకు రసం తాగడం వల్ల మన శరీరానికి ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలున్నాయి. వేసవిలో చెరకు రసం తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు: తక్షణ శక్తి వనరు : చెరకు రసంలో సహజమైన చక్కెరలు (సుక్రోజ్) పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోకి చేరిన వెంటనే శక్తిగా మారతాయి. ఎండలో తిరిగి అలసిపోయినప్పుడు ఒక గ్లాసు చెరకు రసం తాగితే నిమిషాల్లోనే పునరుత్తేజం పొందుతారు. వేసవిలో చెమట ద్వారా శరీరం నీటితో పాటు ముఖ్యమైన ఎలక్ట్రోలైట్లను కోల్పోతుంది. చెరకు రసంలో పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం వంటి ఎలక్ట్రోలైట్లు ఉంటాయి. ఇవి శరీరానికి అవసరమైన ద్రవాలను తిరిగి అందించి, డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడతాయి. "రోజూ ఒక యాపిల్ తింటే డాక్టర్ అవసరమే రాదు.. కారణాలు ఇవే!" కాలేయానికి మంచిది : ఆయుర్వేదంలో చెరకు రసాన్ని కాలేయ సంబంధిత సమస్యలకు ఒక ఔషధంగా పరిగణిస్తారు. ముఖ్యంగా పచ్చ కామెర్లు వచ్చినప్పుడు శరీరం త్వరగా కోలుకోవడానికి చెరకు రసం చాలా ఉపయోగపడుతుంది. ఇది కాలేయ పనితీరును మెరుగుపరచడంలో సహాయపడుతుంది. చెరకు రసం సహజమైన మూత్రవిసర్జనకారి ఇది మూత్రపిండాలు సజావుగా పనిచేయడానికి సహాయపడుతుంది .మూత్రనాళ ఇన్ఫెక్షన్లను నివారించడంలో దోహదపడుతుంది. శరీరంలోని విష పదార్థాలను బయటకు పంపడంలో ఇది సహాయపడుతుంది. : చెరకు రసంలో ఉండే ఫైబర్ మరియు కొన్ని ఇతర పదార్థాలు జీర్ణవ్యవస్థను మెరుగుపరచడంలో సహాయపడతాయి. మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించడంలో ఇది కొంతవరకు ఉపశమనం కలిగిస్తుంది. చెరకు రసంలో యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు (ముఖ్యంగా ః కాంప్లెక్స్), ఖనిజాలు ఉంటాయి. ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేసి, అంటువ్యాధుల నుండి శరీరాన్ని కాపాడతాయి. దీని సహజమైన చల్లదనం వేసవి వేడిని తగ్గించి, శరీరాన్ని కూల్ చేస్తుంది. ఇది శరీరం యొక్క అంతర్గత ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది. చెరకు రసంలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మరియు కొన్ని గ్లైకోలిక్ యాసిడ్ మూలాలు చర్మ సమస్యలను తగ్గించి, చర్మం కాంతివంతంగా, మృదువుగా మారడానికి సహాయప డతాయి. ఎవరు చెరకు రసానికి దూరంగా ఉండాలి? చెరకు రసం వల్ల ఎన్నో ప్రయోజనాలున్నప్పటికీ, కొన్ని ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు దీనిని తీసుకోకపోవడం లేదా చాలా మితంగా తీసుకోవడం మంచిది. ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులు దూరంగా ఉంటే మంచింది. చెరకు రసంలో సహజ చక్కెర (సుక్రోజ్) శాతం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను వేగంగా, అనూహ్యంగా పెంచుతుంది. మధుమేహ వ్యాధితో బాధపడేవారు చెరకు రసానికి పూర్తిగా దూరంగా ఉండటం అత్యంత ముఖ్యం. బరువు తగ్గాలనుకునేవారు కూడా దీనిని తక్కువ తీసుకోవడం మంచిది. చెరకు రసంలో కేలరీలు అధికంగా ఉంటాయి. మితంగా తీసుకుంటే పర్వాలేదు కానీ, బరువు తగ్గాలనుకునేవారు దీనిని ఎక్కువగా తాగితే వారి లక్ష్యం నెరవేరక పోవచ్చు. అంతే కాకుండా చాలామందికి చెరకు రసం జీర్ణక్రియకు సహాయపడినప్పటికీ, కొందరిలో కొన్ని ప్రత్యేకమైన జీర్ణ సమస్యలున్నప్పుడు దీనిని తాగితే అసౌకర్యంగా అనిపించవచ్చు. అయితే ఇది అరుదు. చెరకు రసం ఎప్పుడూ పరిశుభ్రమైన వాతావరణంలో తాజాగా తీసినదాన్నే తాగాలి. సరిగ్గా శుభ్రం చేయని యంత్రాల ద్వారా తీసిన రసం లేదా ఎక్కువసేపు నిల్వ ఉంచిన రసం తాగడం వల్ల కడుపునొప్పి, ఇతర అంటువ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. వదిలిపెట్టొద్దు!" వేసవిలో చెరకు రసం అనేది కేవలం దాహార్తిని తీర్చే పానీయమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందించే పోషకాల గని. అయితే, పైన చెప్పిన ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు జాగ్రత్త వహించడం తప్పనిసరి. సరైన జాగ్రత్తలతో, మితంగా చెరకు రసం తాగడం వల్ల వేసవి వేడిని తట్టుకోవడమే కాదు, అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా పొందవచ్చు.

# వంకాయ, పాలు కలిపి తీసుకుంటున్నారా? అయితే ఇవి తెలుసుకోండి.. లేకపోతే మీకే డేంజర్.!

మన భారతీయ వంటకాల్లో వంకాయది ప్రత్యేక స్థానం. గుత్తి వంకాయ కూర నుండి వంకాయ బజ్జీల వరకు ఎన్నో రకాల రుచికరమైన వంటకాలను దీనితో తయారు చేసుకుంటాం. అలాగే, పాలు సంపూర్ణ ఆహారంగా పరిగణింపబడతాయి, కాల్షియం , ఇతర పోషకాలకు మంచి మూలం. ఈ రెండూ ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేవే అయినా, కొన్ని ఆహార పదార్థాలను కలిపి తీసుకోకూడదని ఆయుర్వేదం చెబుతోంది. అలాంటి వాటిలో వంకాయ, పాలు కలయిక ఒకటి. వంకాయ, పాలను కలిపి తీసుకోవడం వల్ల ఆరోగ్యానికి హానికరం కావచ్చని, కొన్ని రకాల అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయుర్వేద నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీనినే ఆయుర్వేద పరిభాషలో 'విరుద్ధాహారం' అంటారు. అంటే, ఒకటికొకటి సరిపడని ఆహార పదార్థాల కలయిక అన్నమాట. మరి వంకాయ, పాలు కలిపి తీసుకుంటే ఎలాంటి సమస్యలు రావచ్చు? వివరంగా తెలుసుకుందాం' ఆయుర్వేద దృక్కోణం: ఆయుర్వేదం ప్రకారం, ప్రతి ఆహార పదార్థానికి దాని స్వంత గుణం (వేడి లేదా చల్లదనం), రుచి (తీపి, పులుపు, ఉప్పు, కారం, చేదు, వగరు), జీర్ణమయ్యే విధానం ఉంటాయి. వంకాయ వేడి చేసే గుణాన్ని (ఉష్ణ వీర్యం) కలిగి ఉంటుంది. పాలు సహజంగా చల్లని గుణాన్ని (శీతల వీర్యం) కలిగి ఉంటాయి, కానీ జీర్ణమైన తర్వాత వాటి ప్రభావం (విపాకం) కొందరిలో వేడిని పెంచవచ్చు లేదా జీర్ణక్రియపై భిన్నమైన ప్రభావాన్ని చూపవచ్చు. ఇలా భిన్నమైన గుణాలు, జీర్ణక్రియ ప్రక్రియలు కలిగిన ఆహారాలను కలిపి తీసుకున్నప్పుడు, అది మన జీర్ణవ్యవస్థపై అదనపు భారాన్ని మోపుతుంది. జీర్ణక్రియ సరిగా జరగక 'ఆమం' (జీర్ణం కాని ఆహార వ్యర్థాలు, టాక్సిన్స్) ఏర్పడే అవకాశం పెరుగుతుంది. ఈ ఆమం శరీరంలో అనేక సమస్యలకు మూలకారణం అవుతుందని ఆయుర్వేదం వివరిస్తుంది. వంకాయ, పాలు కలయిక వల్ల వచ్చే సంభావ్య ఆరోగ్య సమస్యలు: అజీర్తి సమస్యలు: ఇది అత్యంత సాధారణంగా కనిపించే సమస్య. కడుపు ఉబ్బరం, గ్యాస్, తేన్పులు, కడుపులో అసౌకర్యం, కొన్నిసార్లు కడుపు నొప్పి వంటివి రావచ్చు. భిన్నమైన జీర్ణక్రియ ప్రక్రియల వల్ల ఆహారం సరిగా జీర్ణం కాకపోవడమే దీనికి కారణం. చర్మ సమస్యలు: విరుద్ధాహారం వల్ల ఏర్పడిన ఆమం (టాక్సిన్స్) రక్తంలో కలిసి చర్మానికి చేరినప్పుడు దురద, దద్దుర్లు, ఎగ్జిమా (తామర), మొటిమలు వంటి చర్మ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని నమ్ముతారు. వంకాయ, పాల కలయిక కొందరిలో ఇలాంటి చర్మ ప్రతిచర్యలను ప్రేరేపించవచ్చు. అలెర్జీలు: కొందరికి వంకాయ పడకపోవచ్చు (నైట్ షేడ్ వెజిటబుల్స్ పడని వారు ఉంటారు), మరికొందరికి పాలు (లాక్టోస్ ఇంటాలరెన్స్ లేదా మిల్క్ ప్రోటీన్ అలెర్జీ) పడకపోవచ్చు. ఈ రెండింటినీ కలిపి తీసుకున్నప్పుడు, అలెర్జీ ప్రతిచర్యలు తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. జీర్ణశక్తి మందగించడం: తరచుగా ఇలాంటి విరుద్ధ ఆహారాలను తీసుకోవడం వల్ల దీర్ఘకాలంలో జీర్ణవ్యవస్థ బలహీనపడి, జీర్ణశక్తి మందగించే అవకాశం ఉంటుంది. ఇది పోషకాల శోషణను కూడా ప్రభావితం చేయవచ్చు. కొందరిలో జలుబు, దగ్గు వంటి శ్వాసకోశ సమస్యలు కూడా ప్రేరేపితం కావచ్చని కొన్ని సంప్రదాయ వాదనలున్నాయి. అయితే ఈ సమస్యలు అందరిలోనూ రావాలని లేదు. ఇది వ్యక్తి యొక్క శరీర తత్వం, జీర్ణశక్తి, ఎంత పరిమాణంలో తీసుకున్నారు, ఎంత తరచుగా తీసుకుంటున్నారు అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. కొన్ని వంటకాల్లో వంకాయతో పాటు పెరుగు లేదా మజ్జిగ వంటివి వాడతారు. పాలతో పోలిస్తే, పులియబెట్టిన పాల ఉత్పత్తులు (పెరుగు వంటివి) జీర్ణక్రియకు కొంచెం సులువుగా ఉండవచ్చు, కానీ వీటి విషయంలో కూడా మితంగా ఉండటం, మీ శరీరం ఎలా స్పందిస్తుందో గమనించడం ముఖ్యం. వంకాయ కూర తిన్న వెంటనే పాలు తాగడం లేదా పాలతో చేసిన స్వీట్లు తినడం వంటివి చేయకపోవడం మంచిది. రెండు ఆహారాల మధ్య కనీసం కొంత సమయం వ్యవధి ఉండేలా చూసుకోవాలి. వంకాయ, పాలు రెండూ పోషక విలువలు కలిగిన ఆహారాలే అయినప్పటికీ, ఆయుర్వేద సూత్రాల ప్రకారం వాటిని కలిపి తీసుకోకపోవడమే శ్రేయస్కరం. ముఖ్యంగా జీర్ణ సమస్యలు, చర్మ సమస్యలు, అలెర్జీలు ఉన్నవారు ఈ కలయికకు దూరంగా ఉండటం ఉత్తమం. మీ ఆరోగ్యం విషయంలో ఎలాంటి సందేహాలున్నా లేదా ఇబ్బందులున్నా వైద్యుడిని లేదా అర్హత కలిగిన ఆయుర్వేద నిపుణుడిని సంప్రదించడం ఎల్లప్పుడూ మంచిది. ఆహారం విషయంలో సరైన అవగాహనతో, చిన్న చిన్న జాగ్రత్తలు పాటిస్తే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.





# ప్రతీ దానికి టెన్షన్ పడుతున్నారా? అయితే ఈ జబ్బులు గ్యారెంటీ




టెన్షన్.. ఇప్పుడు చాలామంది జీవితాల్లో దీనిని తగ్గించడం కష్టంగా మారిపోయింది. మారుతున్న జీవన శైలి, ఆహారపు అలవాట్లు, విపరీతమైన పని ఒత్తిడి వెరసి టెన్షన్ అందరి జీవితాల్లోనూ భాగంగా మారింది. ఇక బాగా టెన్షన్ పడితే అనేక రోగాలు వచ్చే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఎంత పని ఒత్తిడి ఉన్నప్పటికీ టెన్షన్ ను తగ్గించుకోవాలని ప్రశాంతంగా బ్రతకడం అలవాటు చేసుకోవాలని చెబుతున్నారు. టెన్షన్ తో హైబీపీ టెన్షన్ తో చేయాల్సిన పనులు సరిగ్గా చేయకపోగా, అనవసరమైన రిస్కులు పడాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. బాగా టెన్షన్ పడితే హైబీపీ వచ్చే ప్రమాదం ఉంటుందని చెబుతున్నారు. హైబీపీ మన శరీరంలోని ధమనుల గోడల పైన ఒత్తిడిని పెంచి మనకు గుండెపోటు, మరియు మూత్రపిండాల వ్యాధులు రావడానికి కారణమవుతుందని అందుకే టెన్షన్ ను తగ్గించుకోవాలని సూచిస్తున్నారు. కారణాలు ఇవే!" టెన్షన్ తో గుండెజబ్బులు, మధుమేహం టెన్షన్ ఎక్కువగా ఉన్నవారిలో గుండె పనితీరు దెబ్బతింటుంది. ఇది గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. బాగా టెన్షన్ పడే వారిలో డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. విపరీతమైన ఒత్తిడి ఇన్సులిన్ ఉత్పత్తిని తగ్గించి, రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను ఒక్కసారిగా పెంచుతుంది. దీనివల్ల మధుమేహం బారిన పడే అవకాశం ఉంది. టెన్షన్ తో జీర్ణ సమస్యలు, నిద్రలేమి టెన్షన్ జీర్ణ వ్యవస్థను దెబ్బతీస్తుంది. దీంతో అజీర్ణం, మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది. విపరీతమైన టెన్షన్ తలనొప్పికి కూడా కారణమవుతుంది. టెన్షన్ కారణంగా నిద్ర స్థాయి కూడా తగ్గుతుంది. నిద్రలేమి సమస్య పెరుగుతుంది. ఫలితంగా శారీరక, మానసిక ఆరోగ్యం పైన ప్రతికూల ప్రభావం పడుతుంది. ' టెన్షన్ తో మానసిక, శారీరక సమస్యలు ఇక ఎక్కువ కాలం పాటు టెన్షన్ పడుతూ ఉండడం ఒక రకమైన ఆందోళనకు, డిప్రెషన్ కు కారణమవుతుంది. మానసిక రుగ్మతలకు కారణంగా మారుతుంది. ఎన్నో అనర్థాలు కలిగించే టెన్షన్ ను పక్కన పెట్టి ప్రశాంతంగా జీవించడం ఉత్తమం. ప్రశాంతంగా ఉన్న వారికి ఎటువంటి రోగాలు వచ్చే అవకాశం లేదు. అందుకీ టెన్షన్ తగ్గించుకోవటానికి యోగా, మెడిటేషన్ వంటివి చేస్తే మంచి ఫలితం ఉంటుంది.


# ఉలవల వలన కలిగే ప్రయోజనాలతో మీ ఆరోగ్యం రేసుగుర్రం

ఉలవలు.. మనకు ఎన్నో పోషకాలను ఇచ్చే, మన ఆరోగ్యానికి ఎంతగానో దోహదం చేసే గింజ ధాన్యాలలో ఉలవలు ఒకటి. ఉలవలలో ఉండే ప్రయోజనాలు మరే ఆహార పదార్థాలలోను ఉండవు అంటే నమ్మి తీరాల్సిందే. అయితే ఉలవలు మనకు ఇచ్చే ఆరోగ్య ప్రయోజనాలను చూడండి. ఉలవలతో ఆరోగ్యం ఉలవలు రుచికే కాదు ఆరోగ్యానికి చాలా మంచిది. ఉలవల్లో ఫైబర్, ప్రోటీన్ ఎక్కువగా ఉంటాయి. ఉలవల్లో ప్రోటీన్, ఐరన్, కాల్షియం, ఫాస్ఫరస్, పీచుపదార్థం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఉలవల్లో ఫైబర్ ఎక్కువగా ఉండటం వల్ల జీర్ణశక్తి మెరుగుపడుతుంది. ఊబకాయం సమస్య ఉన్నవారు ఉలవలను ఆహారంలో భాగంగా చేసుకుంటే మంచిది. తింటే ఊహించని ఆరోగ్య ప్రయోజనాలు " చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది అయితే వీరు ఉలవలను ఎలా ఆహారంలో చేర్చుకోవాలి అంటే ఉలవలను ఉడకబెట్టిన నీటిని చారుగా కాచి, ఉలవచారుని తీసుకుంటే చాలా మంచిది. ఇది చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తుంది. దీంతో క్రమ క్రమంగా ఊబకాయానికి చెక్ పెట్టవచ్చు. లావుగా ఉన్నవాళ్ళు బ్రేక్ ఫాస్ట్ లో ఉలవ పచ్చడి చేసుకొనే తింటే సన్నబడిపోతారు. ఉలవ పచ్చడి తినే వారు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే మరింత రిజల్ట్ కనిపిస్తుంది. రక్త హీనతకు ఉలవలు బెస్ట్ క్రమం తప్పకుండా పీరియడ్స్ రాని మహిళలలు ఎనిమిది గంటలు నానబెట్టిన ఉలవలు తినడం వలన ఆ సమస్యకు చెక్ పెట్టవచ్చు. ఉలవలు తీసుకునే సమయాల్లో మంచి నీరు ఎక్కువగా తాగాలి. రక్తహీనతతో బాధపడేవారు తొందరగా అలసటకు గురవుతారు. ఎప్పుడు నీరసంగా ఉంటారు మామూలు ఆహారంతో సరైన పోషకాలు అందక ఎప్పుడూ బలహీనంగా కనబడుతుంటారు. వారిలో చూపు మందగిస్తుంది ,జ్ఞాపక శక్తి కోల్పోతారు. ఇలాంటివారికి మంచి ఆహారం ఉలవలు అని చెప్పొచ్చు. "బొడ్డులో నూనె వేసుకుంటే జరిగే అద్భుతాలు అన్నీ ఇన్నీ కావు!" ఈ సమస్యలకు ఉలవలతో చెక్ ఉలవలు మన శరీరానికి కావాల్సిన శక్తిని ఇస్తాయి. ఉలవలు రక్త నాళాలలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్ని కరిగించడంలో సహాయపడతాయి. ఉలవలు జీర్ణ శక్తిని మెరుగుపరుస్తాయి. ఆకలిని పెంచుతాయి. ఉలవలు కఫాన్ని తగ్గిస్తాయి. చర్మ సమస్యల నివారణలో, కీళ్ళ నొప్పుల నివారణలో బాగా పని చేస్తాయి.



# ఖర్జూరం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయా? ఇంకెన్ని సమస్యలు వస్తాయో తెలుసా?

ఖర్జూరం.. తీయటి రుచికి, మెత్తటి స్పర్శకు మారుపేరు. ఎడారి ప్రాంతపు బంగారంగా పిలువబడే ఈ ఫలం ఎన్నో పోషక విలువలతో నిండి ఉంటుంది. తక్షణ శక్తిని అందించడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రక్తహీనతను తగ్గించడంలో ఖర్జూరం ఎంతో ఉపయోగపడుతుంది. అందుకే చాలామంది ఖర్జూరాన్ని తమ ఆహారంలో భాగంగా చేసుకుంటారు. అయితే, కొన్ని ప్రత్యేక ఆరోగ్య పరిస్థితులు ఉన్నవారు ఖర్జూరానికి దూరంగా ఉండటం లేదా పరిమితంగా తీసుకోవడం మంచిది. లేదంటే కొన్ని ప్రతికూల ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎవరు ఆ ఖర్జూరం తినకూడదో ఇప్పుడు తెలుసుకుందాం.. రక్తంలో చక్కెర స్థాయిల పెంపు: ఖర్జూరంలో సహజ చక్కెరలు (ఫ్రక్టోజ్, గ్లూకోజ్) అధికంగా ఉంటాయి. మధుమేహం ఉన్నవారు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుకోవడం చాలా ముఖ్యం. ఖర్జూరం తింటే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగే అవకాశం ఉంది. ఇది వారి ఆరోగ్యానికి హాని కలిగించవచ్చు. ఒకవేళ తినాలనిపిస్తే, వైద్యుల సలహా మేరకు చాలా తక్కువ పరిమాణంలో తీసుకోవాలి. వారి డైట్‌లో భాగంగా ఇతర ఆహారాలను బ్యాలెన్స్ చేసుకోవడం కూడా అంతే ముఖ్యం. ంశ్రీబనీ ఖీవజీట "వేసవిలో దొరికే పుచ్చకాయలు...తింటే ఊహించని ఆరోగ్య ప్రయోజనాలు " ఊబకాయంతో బాధపడుతున్నవారు: ఖర్జూరంలో కేలరీలు ఎక్కువ మొత్తంలో ఉంటాయి.




# బాహుబలిని కట్టప్ప చంపకపోతే..

## సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర చర్చ




బాహుబలి మూవీపై ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా ఆసక్తికర చర్చ సాగుతోంది. బాహుబలిని కట్టప్ప ఎందుకు చంపాడు' పదేళ్ల కిందట యావత్ భారత్ దేశం ఈ ప్రశ్నకు సమాధానం కోసం ఎదురు చూసింది. ఒకవేళ 'బాహుబలిని కట్టప్ప చంపకపోతే' అంటూ 'బాహుబలి' టీ-మ్ అడిగిన ప్రశ్నకు రానా సమాధానం ఇచ్చారు. 'అదే జరిగితే, అతని బదులు నేనే చంపేసేవాడిని' అని అన్నారు. దీనిపై ప్రభాస్ స్పందించారు. 'రూ.1000 కోట్ల కలెక్షన్స్ సాధించిన పోస్టర్‌ను పంచుకుంటూ 'దీని కోసం నేను అదే చేయనిచ్చేవాడిని భళ్లా' అని రిప్లై ఇచ్చారు. ప్రస్తుతం ఇద్దరి మధ్య జరిగిన చర్చ సామాజిక మాధ్యమాల వేదికగా నవ్వులు పూయిస్తోంది. ప్రభాస్, రానా, అనుష్క, సత్యరాజ్, రమ్యకృష్ణ కీలక పాత్రల్లో ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ఎపిక్ యాక్షన్ మూవీ 'బాహుబలి'. రెండు భాగాలుగా వచ్చిన ఈ మూవీ తెలుగు సినీ ఖ్యాతిని ప్రపంచ యవనికపై నిలబెట్టింది. ఇప్పుడు ఈ రెండింటినీ కలిపి 'బాహుబలి: ది ఎపిక్' పేరుతో ఒకే మూవీగా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన పనులు మొదలయ్యాయి. ఈ క్రమంలో ప్రభాస్, రానాల మధ్య సామాజిక మాధ్యమాల వేదికగా ఆసక్తికర చర్చ నడిచింది. బాహుబలి: ది ఎపిక్' రన్-టైమ్‌పై ప్రస్తుతం చర్చ నడుస్తోంది. 'బాహుబలి: ది బిగినింగ్', 'బాహుబలి: ది కన్‌క్లూజన్' రెండు సినిమాల నిడివి కలిపితే ఐదున్నర గంటలకు పైనే ఉంది. ఈ మొత్తాన్ని మూడున్నర గంటలకు కాస్త అటూఇటూగా కట్ చేయాల్సి ఉంది. ప్రస్తుతం టీ-మ్ ఈ పనిలోనే ఉంది. కథాగమనంలో ఎలాంటి ఇబ్బంది లేకుండా




రెండు సినిమాలను కలపడం కత్తిమీద సామే. ఇదే విషయమై చిత్ర బృందం కూడా స్పందించింది. అక్టోబరు 31న 'బాహుబలి: ది ఎపిక్'ను విడుదల చేయనున్నారు.

# ప్రభాస్ ఇంట్లో ఖరీదైన కల్పవృక్షం



సినిమాల విషయం పక్కన పెడితే లైఫ్ స్టైల్ విషయాల్లో ప్రభాస్ వార్తల్లో నిలుస్తూ ఉంటాడు. తాజాగా మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆయన కొత్త ఇంట్లో ఏర్పాటు చేసిన ఒక విలువైన చెట్టుపై ఇప్పుడు అందిరి దీష్టి పడింది. అదే కల్పవృక్షం. ఈ చెట్టు- కోసం ప్రభాస్ ఏకంగా రూ. కోటి వరకు ఖర్చు పెట్టినట్టు- సమాచారం. ఈ విషయం సోషల్ మీడియా లో హాట్ టాపిక్ గా మారింది. హిందూ పురాణాలలో కల్పవృక్షంకి ఎంతో ప్రాధాన్యత ఉంది. దేవతల వనంలో ఉండే ఈ చెట్టు-, భక్తుల కోరికలు తీర్చే చెట్టు-గా చెప్పబడుతుంది. శాంతి, సంతానం, సంపద లాంటి ఆశయాల కోసం ఈ చెట్టును కొందరు గృహప్రవేశం సమయంలో, పూజ స్థలాల్లో లేదా ప్రత్యేకంగా ఇంటి పెరట్లో ఏర్పాటు చేస్తారు. ఈ చెట్టు వయస్సును బట్టి దాని విలువ నిర్ధారితమవుతుంది. ఇప్పుడు ప్రభాస్ కొనుగోలు చేసిన కల్పవృక్షం వయసు దాదాపు 100 ఏళ్లు. అందుకే దాని ధర ఏకంగా కోటి రూపాయలు దాటిందట. ప్రభాస్ హైదరాబాద్‌లో నిర్మిస్తున్న విలాసవంతమైన కొత్త ఇంటిలో ఈ చెట్టును ప్రత్యేకంగా దిగించి నాటించారట. ఇది కేవలం సౌందర్యాని కోసం కాదు – ఓ శుభం, శాంతిగా ఉండేందుకు ఏర్పాటు- చేసినదట. ఇంత వరకు ఈ రేంజ్‌లో ఉండే కల్పవృక్షం కేవలం ముఖేష్ అంబానీ ఇంట్లో ఉందని సమాచారం. ఇప్పుడు ప్రభాస్ కూడా అదే తరహాలో స్థిరపడినట్లు ఫిల్మ్ నగర్ వర్గాల్లో టాక్.

# హరిహరవీరమల్లు మూవీకి ఐదేళ్లు

## ప్రమోషన్లలో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్ననిధి

హరిహర వీరమల్లు మూవీ జులై 24న థియేటర్లలోకి రాబోతోంది. ఈ సందర్భంగా హీరోయిన్ నిధి అగర్వాల్ వరుస ఇంటర్వ్యూలు ఇస్తూ ప్రమోషన్లు చేస్తోంది. అయితే ఈ సినిమా మొదలై ఐదేళ్లు అవుతోంది. ఇన్నేళ్లుగా మూవీ వాయిదాలు పడుతూనే వచ్చింది. ఇన్నేళ్లు పడుతుందనే విషయం నిధి అగర్వాల్ కు తెలియదు. అందుకే మూవీకి ఒప్పుకుంది. కానీ అనుకోకుండా మూవీ షూటింగ్ కు ఇన్నేళ్లు పట్టింది. అయితే ఈ ఐదేళ్లు నిధి వేరే సినిమాలు కూడా పెద్దగా చేయలేదు. ఎందుకంటే అందుకు నిధి చేసుకున్న వీరమల్లు అగ్రిమెంట్. ఈ అగ్రిమెంట్ ప్రకారం సినిమా అయిపోయేదాకా వేరే మూవీలు ఒప్పుకోవడానికి వీల్లేదు. మరి ఈ ఐదేళ్లు ఫైనాన్షియల్ గా ఎలాంటి ప్రాబ్లమ్ రాలేదా అంటూ ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు నిధి ఆన్సర్ ఇచ్చింది. ప్రతి నెల నాకు ఒక్క షాప్ ఓపెనింగ్ అయినా వచ్చేది. దాంతో పాటు- యాడ్ ప్రమోషన్లు కూడా వచ్చాయి. అందుకే వాటితో మేనేజ్ చేశాను. ఇన్నేళ్లు ఆలస్యం అయినా ఓ మంచి పాత్రతో వస్తున్నాను అనే మంచి ఫీల్ అయితే ఉంది. అంటూ తెలిపింది నిధి అగర్వాల్.



# ఆస్కార్ లెవల్లో మహేశ్ మూవీకి ప్లాన్

దర్శకధీరుడు రాజమౌళి ఏం చేసినా భారీ ప్లాన్ తోనే చేస్తాడు. ఇప్పుడు మహేశ్ బాబుతో తీస్తున్న ఎస్ ఎస్ ఎంబీ29 సినిమా కోసం భారీ ప్లాన్ చేస్తున్నాడంట. ఆస్కార్ అవార్డు కోసం రాజమౌళి బిగ్ స్కెచ్ వేస్తున్నట్టు- తెలుస్తోంది. ఆల్రెడీ ట్రిబుల్ ఆర్ మూవీతో ఒకటి తీసుకొచ్చాడు. ఇప్పుడు ఇంకోదానిపై కన్నేసినట్టు తెలుస్తోంది. అయితే తెలుగు నిర్మాణ సంస్థలతో మూవీ చేస్తే ప్రతిసారి ఫారిన్ కేటగిరీలో నామినేషన్స్ వేయాల్సి వస్తోంది. అప్పుడు ఆస్కార్ అవార్డుల అవకాశాలు బాగా తగ్గిపోతున్నాయి. ప్రస్తుతం మహేశ్ తో చేస్తున్న మూవీని శ్రీ దుర్గా ఆర్ట్స్ బ్యానర్ మీద డాక్టర్ కెఎల్ నారాయణ నిర్మిస్తున్నారు. తెలుగు బ్యానర్ మీద కాకుండా హాలీవుడ్ బ్యానర్ ను మెయిన్ నిర్మాణ సంస్థగా చూపించేందుకు రాజమౌళి ప్రయత్నిస్తున్నారంట. అందుకోసం హాలీవుడ్ కు చెందిన నిర్మాణ సంస్థలతో చర్చలు జరుపుతున్నట్టు- తెలుస్తోంది. హాలీవుడ్ నిర్మాణ సంస్థను మొదటి ప్రొడ్యూసర్ గా చూపించి కేఎల్ నారాయణను రెండో సంస్థగా చూపించవచ్చు. అలా చేస్తే మూవీ హాలీవుడ్ కోటాలో నేరుగా ఆస్కార్ అవార్డుకు నామినేట్ చేయొచ్చు. అప్పుడు ఎక్కువ విభాగాల్లో ఆస్కార్ కు నామినేషన్స్ వేయొచ్చు. కాకపోతే మూవీ షూట్ ను డైరెక్ట్ గా ఇంగ్లిష్ లో చేయాలి. అదేమంత పెద్ద కష్టం కాకపోయినా.. కొంత బడ్జెట్ పెరుగుతుంది. ఆ లెక్కలు అన్నీ కార్తికేయ చూసుకుంటున్నట్టు- తెలుస్తోంది. అన్నీ కుదిరితే త్వరలోనే దీనిపై అనౌన్స్ మెంట్ వస్తుంది.





# సోషియో డ్రామాగా వస్తున్న పరదా మూవీ

అనుపమ పరమేశ్వరన్ కీలక పాత్రలో ప్రవీణ్ కండ్రేగుల తెరకెక్కించిన చిత్రం 'పరదా'. భిన్నమైన సోషియో డ్రామా కథాంశంతో రూపొందింది. ఆగస్టు 22న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానున్నట్లు టీమ్ అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఈ సినిమా నుంచి థీమ్ ఆఫ్ పరదా 'యత్ర నార్యస్తు పూజ్యంతే..' అనే పాటను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు- చేసిన ఈవెంట్‌కు నిర్మాత సురేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఒక మంచి విడుదల తేదీ దొరకడానికి ఆరు నెలలు పట్టింది. అన్ని ఏర్పాట్లు- చేసుకున్న తర్వాత అదేరోజు పెద్ద సినిమా రిలీజ్ అయ్యేది. థియేటర్లు దొరకలేదు. అందుకే ఇంత సమయం పట్టింది. నిజం చెప్పాలంటే.. ఒక అమ్మాయి ప్రధాన పాత్రలో నటించిన సినిమా వస్తుందంటే.. ఎవరూ ముందుకురారు. నిర్మాతలు, ఓటీటీ- సంస్థలు, ఒక్కోసారి ఆడియన్స్ కూడా ప్రోత్సహించడానికి ముందుకురారు. అది ఎంత మంచి సినిమా అయినా అంతే. దాన్ని తప్పు అని నేను అనడం లేదు. అది వాస్తవం. 'పరదా' కారణంగానే ఈ వాస్తవాన్ని తెలుసుకున్నాను. మా సినిమా సంవత్సరం క్రితమే రెడీ అయింది. ఏడాదిగా మా టీమ్ పడిన కష్టం దగ్గర నుంచి చూశాను. ఇది చిన్న సినిమా అని అందరూ చెబుతున్నారు.. కానీ ఇది చాలా మంచి సినిమా. ఎన్నో కమర్షియల్ మూమెంట్స్ ఉంటాయి. 'పరదా'ను థియేటర్‌లలో చూడాలని కోరుకుంటు-న్నాను. ఇప్పటివరకూ మీ సపోర్ట్‌కు ధన్యవాదాలు. ఇకపై కూడా ఇలానే ఆదరిస్తారని ఆశిస్తున్నాను అని అనుపమ అన్నారు. చిరంజీవి పుట్టినరోజుకు మించి ఈ సినిమాను విడుదల చేయడానికి మంచి తేదీ ఉండదు. అందుకే ఆగస్టు 22న దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించాం. నా మొదటి చిత్రం 'సినిమా బండి'కి ఇఫీలో అవార్డు వచ్చినప్పుడు నేను చిరంజీవి దగ్గర నుంచి దీవెనలు తీసుకున్నాను. 10 ఏళ్ల క్రితం రామానాయుడు స్టూడియోలో సురేశ్ బాబును కలిశాను. అప్పుడే నన్ను ప్రోత్సహించారు. 'పరదా' కథ విన్న తర్వాత సురేశ్‌బాబు కళ్లల్లో నీళ్లు తిరిగాయి. ఇది నాకెంతో ప్రత్యేకం. సినిమా అంతా పరదాలోనే ఉండాలంటే ఏ నటీ- అంగీకరించదు. ఇలాంటి ఛాలెంజింగ్ రోల్‌కు అనుపమ ఓకే చెప్పారు. మా టీమ్ అందరికీ ఇది బాహుబలి లాంటి సినిమా అని దర్శకుడు చెప్పారు. దీని -ట్రైలర్ చూసి నిజంగా షాక్ అయ్యాను. చిత్రబృందమంతా ఎంతో ఆసక్తిగా పనిచేసింది. ధైర్యంగా దీన్ని తీశారు. సినిమా పరిశ్రమ ముందుకుసాగాలి అంటే ఇలాంటి చిత్రాలు రావాలి. నటీనటులంతా వారి



# ప్లాస్టిక్ నుండి మన భూమిని, పర్యావరణాన్ని కాపాడుకుందాం

**రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకోవడంతో పాటు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది**

**జిల్లా ఇన్చార్జి ఆఫీసర్ మరియు రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే**

**ప్లాస్టిక్ వల్ల మానవాళికి ముప్పు..:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**




కర్నూలు/కోడుమూరు(విజయసారథి):ప్లాస్టిక్ నుండి భూమిని, పర్యావరణాన్ని కాపాడుకుందాం అని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిద్దామని జిల్లా ఇన్చార్జి ఆఫీసర్ మరియు రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే గారు తెలిపారు.శనివారం స్వర్ణాంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా కోడుమూరు మండల కేంద్రంలో అంపయ్య సర్కిల్ నుండి ఎంపిడిఓ కార్యాలయం వరకు నిర్వహించిన "ప్లాస్టిక్ కాలుష్యమునకు అంతం" ర్యాలీ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి ఆఫీసర్ మరియు రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే గారు, జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా గారు పాల్గొన్నారు..అనంతరం ఎంపిడిఓ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటి, అక్కడే ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం లో భాగంగా ఈ రోజు "ప్లాస్టిక్ కాలుష్యమునకు అంతం" అనే థీమ్ తో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే విధంగా ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు.స్వర్ణ ఆంధ్ర అంటే బంగారు ఆంధ్ర ప్రదేశ్ అని ఆ దిశగా మన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించుకుంటూ, అంతే పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉందన్నారు.

ప్లాస్టిక్ వినియోగం ద్వారా వాతావరణ కలుషితం అవుతోందని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించడానికి మనమంతా అడుగులు వేయాల్సిన అవసరం చాలా ఉందన్నారు.మనం వాడి పడేసిన ప్లాస్టిక్ మన అందరికన్నా చాలా ఎక్కువ కాలం ఈ భూమిలో బ్రతుకుతుందని, అది అంత సులభంగా మట్టిలో కలిసిపోదని, దీని వలన మనకు ఆహారాన్ని ఈ భూమి పాడైపోతుందని, వాతావరణం పాడైపోతుందని ప్రిన్సిపల్ సెక్రెటరీ తెలిపారు.ప్లాస్టిక్ వ్యర్ధాలు భూములో ఎక్కువగా ఉండటం వల్ల చెట్ల పెరుగుదల కూడా బాగా ప్రభావితం అవుతుందన్నారు.అలాగే భూమి యొక్క సారం కూడా తగ్గిపోతుందని, పంటలు కూడా సరిగ్గా పండని రోజులు కూడా రావచ్చునన్నారు. పర్యావరణంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువ అవటం వలన మైక్రో ప్లాస్టిక్ రూపంలో ప్రాణుల్లోకి చేరే పరిస్థితి ఉందన్నారు.ప్లాస్టిక్ సముద్రంలోకి వెళ్ళినప్పుడు మెరైన్ లైఫ్ అంతా కూడా ప్రభావితం అవుతుందన్నారు.జీవ పరిణామంలో భాగంగా ఈ మైక్రో ప్లాస్టిక్ అనతి కాలంలోనే మన శరీరంలో కూడా చేరి, అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటామన్నారు.50 సంవత్సరాల క్రితం క్యాన్సర్ అనే వ్యాధి మనం ఎప్పుడు వినలేదని, గతంలో ఎన్నడు లేని విధంగా ప్రస్తుతం కాన్సర్ హాస్పిటల్ లు వెలిశాయని, మన చుట్టూ ఇంతమంది క్యాన్సర్ బారిన పడిన వ్యక్తులు లేక కుటుంబాలు ఉన్నాయన్నారు. వాతావరణంలో మార్పులు, కలుషితమైన ఆహారం తీసుకోవడం ఇందుకు కారణం అన్నారు.. ఈ కాలుష్యాన్ని మనమే చేస్తూ మనం దాన్ని ఇంకా ఇంకా ఎక్కువ చేసే పరిస్థితి కనిపిస్తోందన్నారు.మన తాతలు, పెద్దలు పర్యావరణాన్ని కాపాడి, మంచి గాలిని, మంచి నీటిని మనకు ఇచ్చినప్పుడు మనమందరం కూడా అదే బాధ్యతను తీసుకుని మన భావితరాలకు కూడా అలాంటి సదుపాయాన్ని, అలాంటి జీవన ప్రమాణాలను ఇవ్వడం మన బాధ్యతగా తీసుకోవాలన్నారు.ఈ భూమిని కాపాడుకుందాం, పర్యావరణాన్ని కాపాడుదాం ప్లాస్టిక్ నిషేధిద్దామన్నారు ప్లాస్టిక్ ను రెడ్యూస్, రీసైకిల్, రీ యూజ్ తో పాటు రెఫ్యూజ్ (తిరస్కరించే) పరిస్థితి రావాలన్నారు.ప్లాస్టిక్ కు ప్రత్యామ్నాయంగా బయో డిగ్రేడబుల్ ప్లాస్టిక్ తయారు చేసిన వారిని ప్రిన్సిపల్ సెక్రెటరీ అభినందించారు.. ఇలాంటి వాటిని ప్రోత్సహించాలని ఆయన పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ పి .రంజిత్ బాషా మాట్లాడుతూ జనవరి నుండి దాదాపుగా 7 నెలలుగా ప్రతి మూడవ శనివారం ను స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమం పేరిట వివిధ రకాల కార్యక్రమాలను జిల్లా వ్యాప్తంగా చేస్తున్నామన్నారు. ఒక్కొక్క నెల ఒక్కొక్క థీమ్ తో కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మన జిల్లా ప్రతిసారి టాప్ టెన్ లో ఉంటోందన్నారు.ఈ నెలలో "ప్లాస్టిక్ కాలుష్యానికి అంతం" అనే థీమ్ తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు.జూన్ నెలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నామని, అపుడు కూడా ఇదే థీమ్ తీసుకోవడం జరిగిందన్నారు. ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా, రాష్ట్రవ్యాప్తంగా, జిల్లా వ్యాప్తంగా ప్లాస్టిక్ కు వ్యతిరేకంగా ఇన్ని కార్యక్రమాలు చేస్తున్నారు అంటే ప్లాస్టిక్ వల్ల మానవాళికి ముప్పు ఉందని అర్థం చేసుకోవాలన్నారు.ఖాళీ చేతులతో మార్కెట్ కి వెళ్లి ఒక ప్లాస్టిక్ కవర్ లో కూరగాయలు, మాంసం, తదితర వస్తువులను తెచ్చి, వాటిని బయట పడవేయడం వల్ల ప్లాస్టిక్ భూమి, సముద్రం లోకి చేరి కాలుష్యం జరుగుతోందన్నారు ప్లాస్టిక్ 300 సంవత్సరాల పాటు అలాగే ఉంటుందని, భూమిలో పొరలు పొరలుగా నిక్షిప్తం కావడం వల్ల వర్షపు నీరు భూమి లో ఇంకిపోకుండా భూగర్భ జలాల పెంపుకు తీవ్ర అవరోధంగా పరిణమించిందన్నారు. అలాగే సముద్రంలో పడవేయడం వల్ల అక్కడ ఉన్న జీవరాశులు ప్లాస్టిక్ ను తింటున్నాయని, చేపల్లాంటి సీఫుడ్స్ ను మనం తినడం వల్ల కాన్సర్ లాంటి రోగాల బారిన పడడం జరుగుతోందన్నారు.మన ఆరోగ్యానికి, పర్యావరణానికి ఖచ్చితంగా సమస్య ఉంది కాబట్టి మనమందరం మేలుకోవాల్సిన అవసరం ఉందన్నారు.అందువల్ల ఈ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలన్నారు.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకుండా పూర్తిగా నిషేధించాలన్నారు...మన ముందు వారు మనకు ఏ విధంగా అయితే మంచి పర్యావరణాన్ని అందించారో, అదే విధంగా మన భవిష్యత్ తరాలకు కూడా పర్యావరణ హిత వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.. రెడ్యూస్, రీసైకిల్, రీ యూజ్ కాన్సెప్ట్ తో మనందరం ముందుకు వెళ్లాలన్నారు..ప్లాస్టిక్ ని తగ్గించే విధంగా ప్రజల్లో అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.. ఈరోజు నుంచి ప్రభుత్వ కార్యాలయాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్ అన్నిటిని నిషేధించాలన్నారు..వాటిని మనం ఎక్కడా వాడకూడదన్నారు.. స్వయం సహాయక సంఘాల మహిళలు , ఎన్జీవో కు అందరూ ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమం లాగా తీసుకొని ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ పిలుపు ఇచ్చారు.కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్ , జిల్లా పరిషత్ సీఈఓ నాసర రెడ్డి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. అనంతరం స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞను ప్రజలతో చేయించారు.. జిల్లా ఇన్చార్జి ఆఫీసర్ మరియు రవాణా, రోడ్లు భవనాల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా కలెక్టర్ క్లాప్ మిత్రలకు సన్మానం చేశారు. సమావేశంలో డీపీఓ భాస్కర్, కోడుమూరు తహసిల్దార్ నాగరాజు, ఎంపిడిఓ రాముడు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో కక్షపూరిత రాజకీయాలు

**మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేవు**

**రాజకీయ ఒత్తిళ్లతో కేసులు నమోదు**

**వైసిపి ఎంపి మిథున్ రెడ్డి వెల్లడి**



న్యూఢిల్లీ,జూలై19: ఏపీలో మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేవు.. రాజకీయ ఒత్తిడితోనే తనపై కేసు పెట్టారని వైఎస్సార్సీపీ ఎంపీ మిథున్ రెడ్డి తెలిపారు. మద్యం కేసులో తన పాత్రపై ఆధారాలు ఉంటే చూపించాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్సీపీలో ముఖ్యమైన నాయకులను జైల్లో పెట్టడమే టార్గెట్గా కేసులు పెడుతున్నారని ఆరోపించారు. ఇదే సమయంలో సిట్ విచారణకు తాను హాజరు అవుతున్నట్టు మిథున్ రెడ్డి చెప్పారు. ఈ క్రమంలోనే మిథున్ రెడ్డి ఢిల్లీ నుంచి విజయవాడకు బయలు దేరేముందు మీడియాతో మాట్లాడారు. ఏపీలో కక్షపూరిత రాజకీయాలు జరుగుతున్నాయని, మద్యం కేసులో ఎలాంటి ఆధారాలు లేవు. ఈ కేసులో ఎలాంటి సీజర్లు లేవు, సాక్ష్యాలు లేవని అందుకే కేసులకు భయపడే ప్రసక్తి లేదన్నారు. భయపడే వ్యక్తిని అయితే రాజకీయాల్లోనే ఉండను. వీటన్నిటిని ధైర్యంగా ఎదుర్కొంటాను. ఈ కేసుల నుంచి బయటపడతాను. నా పాత్రపై ఆధారాలు ఉంటే చూపించండి. నా ఫోన్లు మీకు ఇస్తా.. దర్యాప్తునకు సహకరిస్తాను. సిట్ వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. రాజకీయ ఒత్తిడితోనే నాపై కేసు పెట్టారు. ముందుగానే ఒక వ్యక్తిని జైల్లో వేయాలని నిర్ణయించుకుని.. ఆ తర్వాత దాని చుట్టూ కథ అల్లుతున్నారని మండుపడ్డారు. తమకు అనుకూలంగా ఉన్న వారిని నయానో.. భయానో ఒప్పించి స్టేట్మెంట్లు తీసుకుంటున్నారు. నోటి మాటలతో ప్రకటనలు ఇప్పించి కేసు నడుపుతున్నారు. ముఖ్యమైన నాయకులను జైల్లో పెట్టడమే టార్గెట్ గా కేసులు పెడుతున్నారు. మద్యం కేసు వారి టార్గెట్ కాదు. తమకు నచ్చని వారిని వేధించేందుకు రకరకాల కథలు అల్లుతున్నారు.. ఇదేమి కొత్తది కాదు. 2014–19 లోను నాపై తప్పుడు కేసులు పెట్టారు. నేనేదో దాడి చేశానని నాడు టీడీపీ హయాంలో కేసు పెట్టారు. నేను తప్పు చేయలేదని ఎంత చెప్పినా వినకుండా జైల్లో పెట్టారు. అప్పుడు తప్పుడు సాక్షాలు చెప్పిన వారంతా.. మళ్లీ కోర్టుకు వచ్చి అదంతా తప్పు అని చెప్పారు. దాంతో కోర్టు ఆ కేసును కొట్టివేసింది. మళ్లీ అదే తరహాలో ఇప్పుడు అరెస్టు చేస్తున్నారు. వీటన్నిటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. ఎవరినైనా అరెస్టు చేయాలనుకుంటే ముందుగా ఎల్లో మీడియాలో.. మాస్టర్ మైండ్ అని కట్టుకథలు అల్లుతున్నారు. గతంలో ఇతరులను మాస్టర్ మైండ్ అన్నారు.. ఇప్పుడు నన్ను మాస్టర్ మైండ్ అంటున్నారు.. రేపు ఇంకొకరిని పట్టుకొచ్చి అతన్ని మాస్టర్ మైండ్ అంటారు. ఏదోరకంగా మాపై బురద జల్లాలని చూస్తున్నారు. కొద్దిమంది అధికారులను తీసుకొచ్చి భయపెట్టి.. ఒప్పుకోకపోతే జైల్లో పెడతామని ప్రకటనలు తీసుకుంటున్నారు. మేము ఎక్కడ కలిశామో ఆధారాలు చూపండి. నోటి మాటతో కేసు పెడతారా?రేపు రాబోయే రోజుల్లో ఇదే అధికారులను బెదిరించి చెప్పించారని కోర్టులో చెబుతారు.. కేసు కొట్టివేస్తారు. గతంలో కూడా ఇలాగే నాపై తప్పుడు కేసు పెడితే కోర్టు కొట్టేసింది. ఈ కేసులో రేపు జరగబోయేది కూడా ఇదేనన్నారు. మద్యం కేసులో మొదట్లో 50వేల కోట్లు అన్నారు. ఆ తర్వాత 30,000 కోట్లు–.. అటు– తర్వాత 3000 కోట్లు– అని అంటున్నారు. 3000 కోట్లు ఎక్కడ అంటే.. ఎలక్షన్లో ఖర్చు పెట్టారని చెబుతున్నారు. సిట్ చెప్పే కట్టు కథలు నమ్మదగినవి కాదు. ఎక్కడైనా డబ్బును సీజ్ చేశారా?. పెట్టు–బడులు పెట్టారా?. ఇవన్నీ లేకుండా కేవలం నోటి మాటతో కథలు చెబుతున్నారు. అరెస్టు చేసి ఇబ్బంది పెట్టాలని లక్ష్యంతోనే ఈ కేసులు పెట్టారు..

# విశాఖ నగరంలో ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుదాం

**విశాఖ నగరాన్ని స్వచ్ఛంగా తీర్చిదిద్ది స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర అభివృద్ధికి సహకరిద్దాం**

**విశాఖ జిల్లా కలెక్టర్ ఎం ఎన్ హరేంధిర ప్రసాద్**





విశాఖపట్నం(విజయసారథి): విశాఖ నగరంలో ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలనే నేపథ్యంతో స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాల్లో పాల్గొని,విశాఖ నగరం నుండి ప్లాస్టిక్ వస్తువులను పారద్రోలి, ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలని , పర్యావరణహితమైన ప్రత్యామ్నాయ వస్తువులనే వినియోగిస్తూ విశాఖ నగర పర్యావరణ పరిరక్షణకు ప్రజలందరూ కృషి చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం ఆయన 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్. వర్మలతో కలిసి జోన్ –2, ఎండాడ జంక్షన్ వద్ద ఆర్ఆర్ఆర్ సెంటర్ లో జీవీఎంసీ ఏర్పాటుచేసిన స్వచ్ఛ ఆంధ్ర –స్వర్ణ ఆంధ్ర కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా కలెక్టర్ ఎం ఎన్.హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల 3 వ శనివారం ఒక అవగాహన కార్యక్రమం నేపథ్యంతో రాష్ట్రమంతటా స్వర్ణ ఆంధ్ర– స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతోందని అన్నారు. ఆ దిశగా విశాఖ నగరంలో ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలుకుతూ ఈ నగరం నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను తరిమికొట్టి, పర్యావరణహితమైన ప్రత్యామ్నాయ వస్తువులనే వినియోగించాలనే ఈ నేపద్య కార్యక్రమంలో ప్రజలు అధిక సంఖ్యలో భాగస్వామ్యమవ్వాలన్నారు. మనం రోజు వినియోగించే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు కాలువలలో , గెడ్డలలో చేరి వర్షాలు సమయంలో పొంగిపొర్లి వ్యాధులకు కారణమవుతున్నాయన్నారు. పారిశుద్ధ్య కార్మికులు ప్రాణాలను పణంగా పెట్టి గెడ్డలలో ప్లాస్టిక్ వ్యర్ధాలను నిత్యం వెలికి తీస్తున్నారన్నారు. ప్లాస్టిక్ వ్యర్ధాలు సముద్రంలో చేరడం వలన ఆహారంగా తింటున్న చేపలను మనం వినియోగించడం వలన క్యాన్సర్ వ్యాధులకు గురవుతూ ప్రాణాలకు ముప్పు కలిగించుకుంటున్నామన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులైన పేపర్, వస్త్ర, నార సంచులు, స్టీలు ,గ్లాసు , పింగాణి గిన్నెలు ,కప్పులు , డబ్బాలు ,వాటర్ బాటిళ్ళు మొదలగు పర్యావరణహితమైన వస్తువులను వినియోగించాలని, మన చిన్న అలవాట్లతో ఒక పెద్ద మార్పు నాందికి ప్రజలందరూ అవగాహనతో ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలని , పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తూ స్వర్ణాంధ్ర అభివృద్ధి దిశగా స్వచ్ఛ విశాఖ కు సహకరించాలని ప్రజలకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.అనంతరం 8వ వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వలన ఈ భూమికి హాని , నష్టం కలుగుతుందని, ప్రజలు అవగాహనతో విశాఖ నగర పర్యావరణ పరిరక్షణ దిశగా ప్లాస్టిక్ వస్తువులకు బదులుగా ప్రత్యామ్నాయ వస్తువులను వినియోగించాలని అందుకు ప్రజలందరూ సహకరించాలన్నారు.అనంతరం అదనపు కమిషనర్ డి.వి.రమణమూర్తి మాట్లాడుతూ 2027 వ సంవత్సరానికి స్వర్ణాంధ్ర సాధనకు అభివృద్ధి దిశగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని, ప్రకృతి, పర్యావరణ సమతుల్యతతో విశాఖ నగర అభివృద్ధి సాధన లక్ష్యంగా ప్రజలు అవగాహనతో ఈ విశాఖ నగరం నుండి ప్లాస్టిక్ వస్తువులను పారద్రోలి ,ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు పలకాలన్నారు.అనంతరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ ఎన్ వి నరేష్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగానికి బదులుగా విశాఖ నగరంలో ప్రత్యామ్నాయ వస్తువులను జీవీఎంసీ అందుబాటులోకి తీసుకు వచ్చిందని ప్రజలు అందరూ పర్యావరణహితమైన వస్తువులనే వినియోగించాలని తెలిపారు.అనంతరం విశాఖ జిల్లా కలెక్టర్ ఈ కార్యక్రమానికి హాజరైన వారందరితో కలసి అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ చే "స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ "ను చేయించి, "లెట్స్ ఎండ్ ప్లాస్టిక్ పొల్యూషన్ టుగెదర్" అనే సమాచారంతో కూడిన అవగాహన పోస్టర్ ను విడుదల చేశారు. విశాఖ నగరానికి జాతీయస్థాయిలో సఫాయిమిత్ర సురక్షిత్ శెహర్ ప్రత్యేక కేటగిరీలో ప్రథమ స్థానం సాధనకు కృషిచేసిన పారిశుద్ధ్య కార్మికుల్లో పలువురు పారిశుద్ధ్య కార్మికులను, పలువురు ఎన్జీవో సంస్థల ప్రతినిధులను ఈ కార్యక్రమంలో సత్కరించి వారిని కలెక్టర్ అభినందించారు. అనంతరం కార్యక్రమం ప్రాంగణంలో పర్యావరణహితమైన వస్తువులకు సంబంధించిన ఏర్పాటుచేసిన పలు స్టాళ్లను కలెక్టర్ సందర్శించి వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో యు సి డి ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.ఎం సత్యవేణి,జోనల్ కమిషనర్లు ఇప్పి నాయుడు, కె.కనకమహాలక్ష్మి, సహాయక వైద్యాధికారి డాక్టర్ ఎన్ .కిషోర్ కుమార్, స్వచ్ఛంద సంస్థలు, టిడిపి జనసేన పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా అండగా ఉంటాం

**రాష్ట్ర మంత్రి టి.జి భరత్**

**అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌ను సందర్శించిన మంత్రి**




అనకాపల్లి/కర్నూలు(విజయసారథి):ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టి.జి భరత్ అన్నారు. అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి లో మంత్రి టీజీ భరత్ పర్యటించారు. ముందుగా , అచ్యుతాపురంలోని ఏపీఐఐసీ జోనల్ కార్యాలయంను సందర్శించి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ మరియు ఏపీఐఐసీ ప్రధాన కార్యాలయ ఇంజనీరింగ్ విభాగపు సిబ్బందితో, అనకాపల్లి జోన్ యందు ప్రస్తుతం జరుగుచున్న ప్రాజెక్ట్ పనుల పురోగతిని సమీక్షించారు. నక్కపల్లి క్లస్టర్ యందు బల్క్ డ్రగ్ ప్రాజెక్ట్ మరియు ఏ. ఎమ్. ఎన్ ఎస్ ప్రాజెక్టుల పురోగతి గురించి సిబ్బంది మరియు కాంట్రాక్టర్ లతో సమీక్షించారు. అచ్యుతాపురం సెజ్ లో గ్రీన్ హైడ్రోజెన్ ప్రాజెక్ట్ పనుల పురోగతి గురించి సమీక్ష చేశారు. ఏం ఎస్ ఎం ఈ పార్కుల అభివృద్ధి మరియు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన భూ కేటాయింపుల వివరాలు, సదరు ప్రాజెక్ట్ ల అమలు గురించి సమీక్ష చేశారు. అనంతరం అనకాపల్లి ఇండస్ట్రియల్ జోన్ పారిశ్రామికవేత్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించి, వారు ప్రభుత్వం నుండి కోరుతున్న ఉపశమనములు, మరియు వారు స్థానికంగా ఎదుర్కొంటున్న సమస్యలు గురించి చర్చించారు. అనంతరం క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా అచ్యుతాపురం ఏ.ఈ. టి.ఎల్ కేంద్రాన్ని సందర్శించి, ప్రస్తుత వ్యర్థాల నిర్వహణ సామర్థ్యం మరియు వ్యర్థాల నిర్వహణ కెపాసిటీ పెంపు గురించి ఆరా తీశారు. అనంతరం పలు సంస్థలను సందర్శించారు.అనంతరం మంత్రి టి.జి భరత్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఎల్లప్పుడూ పారిశ్రామికవేత్తలకు అండగా ఉంటుందన్నారు. అచ్యుతాపురం సెజ్ లోని పారిశ్రామికవేత్తలు తెలియజేసిన సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరిస్తుందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, స్పీడ్ ఆఫ్ డూయింగ్ వర్క్స్ చేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు బ్రాండ్‌తో ఏడాదిలోనే తొమ్మిదిన్నర లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయన్నారు. 20 లక్షల ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

# రాయలసీమ అసలు ద్రోహి చంద్రబాబే

**మాజీమంత్రి శైలజానాథ్ విమర్శలు**

అమరావతి,జూలై19: చంద్రబాబే నిజమైన రాయలసీమ ద్రోహి అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ మంత్రి శైలజానాథ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హంద్రీనీవా ప్రాజెక్టుపై చంద్రబాబు ఉపన్యాసం హాస్యాస్పదంగా ఉన్నాయని పేర్కొన్నారు. 1996, 99 ఎన్నికల సమయంలో హంద్రీనీవా ప్రాజెక్టుకు రెండు సార్లు శంకుస్థాపన చేసిన చరిత్ర చంద్రబాబుదే.. 40 టీఎంసీల హంద్రీనీవా ప్రాజెక్టును ఐదు టీఎంసీలకు కుదించిన ఘనుడు కూడా చంద్రబాబే.. హంద్రీనీవా ప్రాజెక్టు వైఎస్సార్ పుణ్యమే.. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో హంద్రీనీవా ప్రాజెక్టు పనులు యుద్ధ ప్రాతిపదికన జరిగిన విషయం తెలుసుకోండి

## ప్రభుత్వ కార్యాలయాల్లో ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాలు

ప్లాస్టిక్ వస్తువులను తొలగించి, పరిశుభ్రతా చర్యలు చేపట్టిన ఉద్యోగులు

ఎండాడ వద్ద జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



విశాఖపట్టణం(విజయసారథి):రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాలు ఉత్సాహంగా చేపట్టారు. అధికారులు, సిబ్బంది పరిశుభ్రతా చర్యలు చేపట్టారు. జూలై మాసంలోని మూడో శనివారం థీమ్ ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతమొద్దిద్దాం అనే నినాదంలో భాగంగా పనికిరాని పాత వస్తువులను, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను తొలగించారు. కార్యాలయాల ఆవరణల్లోని పిచ్చి మొక్కలను తొలగించి బ్లీచింగ్ చల్లారు. దోమలు వ్యాప్తి చెందకుండా, అపరిశుభ్ర వాతావరణం లేకుండా మందులను పిచికారీ చేశారు. తుప్పు పట్టిన ఇనుప వస్తువులను తొలగించారు. పేరుకుపోయిన ప్లాస్టిక్ వస్తువులను ఒకచోట వేసి నిప్పంటించారు. పరిసరాల్లో శుభ్రతా చర్యలు చేపట్టారు. అధికారులు, సిబ్బంది ఒకచోట చేరి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి పలుకుదామని పేర్కొంటూ సామూహిక ప్రతిజ్ఞలు చేశారు. కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇదిలా ఉండగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఎండాడ ఆర్.ఆర్.ఆర్. సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలని, ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొడదామని పిలుపునిచ్చారు.


## బూరుగుపూడి గ్రామంలోడ్వాక్రా సంఘాల స్త్రీనిధి సొమ్ములను తమ అకౌంట్లోకి మార్చుకొని స్వాహా చేసిన యానిమేటర్ అరెస్టు



కాకినాడ(విజయసారథి):కాకినాడ జిల్లాకిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన దుర్గ,అనే ఆమె 2022 వ సంవత్సరం నుండి డ్వాక్రా యాని మేటర్ – ఎ (వి ఓ ఏ)( గ్రామ స్వయం సహాయక సంఘము ల సహాయకురాలు (విలేజ్ ఆర్గనైజేషన్ అసిస్టెంట్) గా పనిచేస్తు 42 డ్వాక్రా గ్రూప్ లకు ఇన్ చార్జ్ గా ఉంటూ డ్వాక్రా గ్రూప్ ల పర్యవేక్షణ రికార్డుల మెయింటినెన్స్ మరియు సమావేశంలను నిర్వహించుట ఆమె బాధ్యతలు. ఆ క్రమము లో బూరుగుపూడి గ్రామము లో తన పరిధి లో గల 12 గ్రూప్ లకు 2023 వ సంవత్సరం లో స్త్రీ నిధి ద్వారా లోను ఇప్పించి సదరు లోను లోని 8 గ్రూప్ ల సబ్యుల నుండి వేరే డబ్బులు మీ అక్కౌంట్ లలో పడ్డాయి అని వారి సంతకాలు/వేలిముద్రలు తీసుకుని 8 గ్రూప్ ల వద్ద నుండి మోస పూరితముగా సుమారు 20 లక్షల 25 వేల రూపాయలు కాజేసిగ్రామం నుండి పారిపోవడం జరిగింది. దీనిపై కిర్లంపూడి పోలీసు వారికి ది.24.05.2025 వ తేదీన అదే గ్రామానికి చెందిన దేవి శక్తీ డ్వాక్రా గ్రూప్ ప్రెసిడెంట్ కె. వీర లక్ష్మి ఇచ్చిన పిర్యాదు మీద కిర్లంపూడి పోలీసు స్టేషన్ నందు ఫిర్యాదు చేయగా సదరు ఫిర్యాదు పై కిర్లంపూడి పిఎస్ లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరిగింది.సదరు నిందితురాలు దుర్గ ను పెద్దాపురం ఎస్డిపిఓ శ్రీహరి రాజు పర్యవేక్షణలో, జగ్గంపేట సీఐ వైఆర్కే శ్రీనివాస్ఆధ్వర్యంలో కిర్లంపూడి ఎస్సై జి. సతీష్, మహిళా హెడ్ కానిస్టేబు లుగురుశ్రీ, పిసి శివప్రసాద్లు అనేక రకాలుగా ప్రయత్నించి ఆమెను అరెస్టు చేసి ప్రత్తిపాడు గౌరవ కోర్టు వారి వద్ద హాజరు పరచగా 14 రోజులు రిమాండ్ విధించగా రాజమండ్రి మహిళా జైలుకు తరలించడం జరిగిందని పోలీసులు తెలిపారు.

## ఆదోని నియోజకవర్గంలో యూరియా కొరత లేకుండా చేస్తాం

ఆదోని(విజయసారథి):మదిరె సహకార సంఘం చైర్మన్ దామోదర్ చౌదరి ఆదోని నియోజకవర్గంలో టిడిపి ఇన్చార్జ్ మీనాక్షి నాయుడు ఆదేశాల మేరకు మధిరె గ్రామంలోని రైతు భరోసా కేంద్రంలో రైతులకు యూరియా సంచులు పంపిణీ చేసారు. ప్రతిపక్షా పార్టీ నేతలు కూటమి ప్రభుత్వంపై అపోహలు



సృష్టిస్తున్నారని అపోహలను నమ్మొద్దని మధిరె సొసైటీ డైరెక్టర్ మగ్దుంభాషా తెలిపారు. ఆదోని నియోజకవర్గంలోని ఉండే రైతులకు యూరియా సంచులు కావాలంటే మదిరే సొసైటీ కమిటీని సంప్రదిస్తే అధికారుల ద్వారా రైతులకు యూరియాను అందిస్తామని చెప్పారు . ఈ కార్యక్రమంలో మధిరె గ్రామానికి చెందిన రైతులు, మధిరె గ్రామ టిడిపి నాయకులు వీరేష్, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలి

స్వచ్ఛ అనంతపురంను తీర్చిదిద్దాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్

నార్పల మండలంలోని బొందలవాడ గ్రామంలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, తదితరులు

అనంతపురం(విజయ సారథి):ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలని, స్వచ్ఛ గ్రామం, అనంతపురం, ఆంధ్రప్రదేశ్, దేశాన్ని తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పిలుపునిచ్చారు. ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నార్పల మండలంలోని బొందలవాడ గ్రామ పంచాయతీలో "అంతం – ప్లాస్టిక్ కాలుష్యం" అనవసరమైన ప్లాస్టిక్లు మరియు సంబంధిత కాలుష్యాన్ని నివారించాలనే థీమ్ తో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో జిల్లా కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలతో ప్రతినెల 3వ శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర అనే నినాదంతో నిర్వహించే ఈ కార్యక్రమం ఈరోజు గ్రామంలో ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదాన్ని అనంతపురం మున్సిపాలిటీలో ఇప్పటికే అమలు చేయడం జరిగిందని, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా దానిని అమలు చేస్తున్నామన్నారు. రోజు ఇంటి దగ్గర నుంచి చెత్త సేకరణతో పాటు దానిని ఎస్.డబ్ల్యు.పి.సి షెడ్ కు తీసుకువచ్చి దాని ప్రాసెసింగ్ పై దృష్టి పెడుతున్నామన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఉన్న చెత్తను తొలగించే పని మొదలైందని, రాబోయే రోజుల్లో జిల్లాను స్వచ్ఛ అనంతపురంగా తీర్చిదిద్దడానికి రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు అన్ని పనులను చేపట్టడం జరుగుతోందన్నారు. ప్రజలు కూడా ఇంటా, బయట, కార్యాలయాల్లో, అన్నిచోట్ల పరిశుభ్రతని పాటించాలన్నారు. ఈ కార్యక్రమం కింద సందేశం స్ఫూర్తిదాయకంగా ఉండాలని, గ్రామం, ఇళ్లు, బడి, వీధులు బాగుండాలని, అప్పుడు గ్రామం, జిల్లా, దేశం బాగుంటుందన్నారు. జిల్లాలో ఒక మంచి చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం గ్రామంలో ఉండడం పట్ల చాలా సంతోషంగా ఉందన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కింద కలెక్టరేట్ లో ప్లాస్టిక్ బాటిల్ వాడడం లేదని, ఎక్కడ ప్లాస్టిక్ బాటిల్స్ వాడరాదని, ప్లాస్టిక్ వాడకండా ప్రత్యామ్నాయాలు వాడాలన్నారు. ఇంటి వద్దనే పరిశుభ్రత చర్యలు వాడడానికి ఉపాధి హామీ కింద చాలా పనులు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోవాలన్నారు. గ్రామంలో నిలబడే నీటి వద్ద కమ్యూనిటీ సోక్ పిట్లను ఏర్పాటు చేయాలని, దాని ద్వారా నీరు ఇంకి బోర్లు రిచార్జ్ అవుతాయన్నారు. ఇంటిపైన రూఫ్ టాఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ లు ఏర్పాటు చేసి నీరు ఇంకెలా చూడాలన్నారు. నీటిని మీరు కాపాడాలని, అనంతరం నీరు వాడాలని సూచించారు. గ్రామంలో బీటీ రోడ్లను, ఓపెన్ జిమ్, డ్రైన్స్ ను మంజూరు చేస్తామన్నారు.:గోకులం షెడ్ ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా గ్రామంలో రైతు రామాంజనేయులు బ/నీ నల్లప్పకు ఉపాధి హామీకి పథకం కింద గోకులం షెడ్డు 2.30 లక్షల రూపాయలతో మంజూరు చేసి నిర్మాణం పూర్తి చేయగా, షెడ్డును రిబ్బన్ కట్ చేసి జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. రైతుతో మాట్లాడుతూ పశువులకు మేత ఎక్కడ నుంచి తీసుకొస్తారు, మీకు పొలం ఎంత ఉంది, ఏ పంట పెట్టారు, ఈ షెడ్డు మీకు అనుకూలంగా ఉంటుందా అంటూ పలు వివరాలను ఆరా తీసి షెడ్డును మంచిగా ఉపయోగించుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అనంతరం అక్కడే కంపోస్ట్ పిట్ కు జిల్లా కలెక్టర్ భూమి పూజ చేశారు. తదనంతరం ఉపాధి హామీ కింద లబ్ధిదారురాలు లక్ష్మీదేవి ఇంటి వద్ద వ్యక్తిగత ఇంకుడు గుంతకు భూమి పూజ చేసి, దీనివల్ల ఏం ఉపయోగాలు ఉంటాయనేది లబ్ధిదారులను అడిగి తెలుసుకుని, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.×ల:ఎస్.డబ్ల్యూ.పి.సి షెడ్ తనిఖీ.ఆ తర్వాత గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రం (ఎస్.డబ్ల్యూ.పి సి షెడ్)ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో చెత్త తీసుకువచ్చి తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి వర్మీ కంపోస్ట్ తయారు చేయాలని, వర్మీ కంపోస్ట్ అమ్మకాలు కొనసాగించాలని ఆదేశించారు. ఇక్కడ ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా గ్రామంలో మానవహారం ఏర్పాటు చేసి ప్రతి ఒక్కరూ పరిశు




భ్రత పాటించాలని, స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దాలని స్వచ్ఛంద ప్రతిజ్ఞను జిల్లా కలెక్టర్, అందరిచేత ఏపీఓ చేయించారు. తదనంతరం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను తనిఖీ చేశారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మరుగుదొడ్లను తనిఖీ చేసి, పాఠశాల ఆవరణంలో రూఫ్ ఆఫ్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్ ఏర్పాటుకోసం జిల్లా కలెక్టర్ భూమి పూజ చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో క్లాప్ మిత్రలను జిల్లా కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, సర్పంచ్ లు సన్మానించారు. ఇంటింటికి చెత్త బుట్టలను, క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలకు సంబంధించి కోటిన్నర రూపాయల మెగా చెక్ ను జిల్లా కలెక్టర్ మహిళలకు అందజేశారు. చివరగా సర్పంచ్, ఉప సర్పంచ్ లు జిల్లా కలెక్టర్ కు చిరు జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో డిపిఓ నాగరాజునాయుడు, జడ్పి సిఈఓ శివశంకర్, పిడి సలీం భాష, జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ రామ సుబ్బారెడ్డి, సర్పంచ్ ఆలం శిరీష, ఉప సర్పంచ్ ఆలం వెంకట నరసానాయుడు, తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీవో మమతాదేవి, ఏపీవో ఎర్రమ్మ, పంచాయతీ సెక్రెటరీ, వార్డు మెంబర్ లు, ఆయా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోండి

ఈనెల 21వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ

జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్



అనంతపురం(విజయ సారథి):మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి మీకోసం డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ఈనెల 21వ తేదీన కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ.ఈనెల 21వ తేదీన సోమవారం అనంతపురం కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని కలెక్టరేట్లోని రెవెన్యూ భవనంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో తమ వివరాలతో పాటు వారి సమస్యలకు సంబంధించి అర్జీలను అందజేయాలన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి





.పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలి.

రాష్ట్ర మైనార్టీ, న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్

ప్లాస్టిక్ వాడటం వల్ల ఎన్నో అనర్ధాలు

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ జి రాజకుమారి

నంద్యాల(విజయ సారథి):నంద్యాల జిల్లాను ప్లాస్టిక్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సమన్వయంతో కృషి చేయాలనిరాష్ట్ర మైనార్టీ, న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ పేర్కొన్నారు. శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద కార్యక్రమంలో భాగంగా నంద్యాల పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ సమీపంలో "స్వచ్ఛత ప్లాస్టిక్ నిర్మూలన"కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ, న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్, జిల్లా కలెక్టర్ జి రాజకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ, న్యాయ, సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎం డి ఫరూక్ మాట్లాడుతూ....అధికారులు ప్రజాప్రతినిధులు స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమంపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. నంద్యాల మున్సిపాలిటీలో దాదాపు 700 మంది సిబ్బంది పనిచేస్తున్నారని వీరందరూ సమన్వయంతో పట్టణంలో పారిశుధ్య కార్యక్రమాలు విరివిగా చేపట్టాలన్నారు. మున్సిపల్ అధికారులు అక్రమ కట్టడాలపై దృష్టి పెట్టి నివారించాలన్నారు. బ్రాందీ షాపులు, హోటల్ల దగ్గర డిస్పోజబుల్ గ్లాసులు వేసి ఆ ప్రాంతాలను అపరిశుభ్రంగా మారుస్తున్నారని వీటిపై పోలీస్, మున్సిపల్ యంత్రాంగం దృష్టి పెట్టి తగు చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణంలో మొక్కలు పెంచి పచ్చదనాన్ని పెంపొందించడంతోపాటు డ్రైనేజీ కాలువలు, రోడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్ల పైన ఎక్కడపడితే అక్కడ తోపుడు బండ్లు పెట్టి ట్రాఫిక్ కు అంతరాయం కలిగిస్తూ తోపుడుబండ్లపై కుళ్ళిపోయిన తినుబండారాలు విక్రయిస్తుంటారని వీటిపై ఫుడ్ ఇన్స్పెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు గారు పి-4 కార్యక్రమం ద్వారా పేదరిక నిర్మూలనకు విశేష కృషి చేస్తున్నారని పట్టణంలోని ధనవంతులందరూ ముందుకు వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.నంద్యాల జిల్లాలో ఎన్నో వనరులు ఉన్నాయని ప్రభుత్వం చేసే అభివృద్ధి కార్యక్రమాలన్నీ ప్రజలకు తెలియజేసి వారికి అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకొని శుభ్రత పాటించాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మాట్లాడుతూ....ఈ ఏడాది మొదటి నెల జనవరి నుంచి స్వర్ణాంధ్ర స్వచంద్ర కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు జరుపుకుంటున్నామని ప్రతి ఒక్కరూ ఇందులో భాగస్వాములై మన ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచుకునేందుకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెల ఒక్కొక్క కాన్సెప్ట్ తో ఒక్కొక్క కార్యక్రమం చేపట్టి పరిశుభ్రతపై ప్రజలను చైతన్యవంతులు చేయడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ కవర్లు డిస్పోజబుల్ గ్లాసులు పూర్తిగా నివారించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ప్లాస్టిక్ బ్యాన్ చేస్తే వాటి ఉత్పత్తిదారులు నష్టపోకుండా వారికి ప్రత్యామ్నాయ ఉపాధి జూట్ బ్యాగ్స్, పేపర్ బ్యాగ్స్ తయారుచేసి ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలన్నారు. ప్లాస్టిక్ వాడటం వల్ల ఎన్నో అనర్ధాలు ఉన్నాయని వీటిని దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ ఉత్పత్తిదారులు కొంత సమయం తీసుకుని వీటిని పూర్తిగా నివారించాలన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు ప్లాస్టిక్ వాడకూడదని చెప్పుతున్నప్పటికీ ఇంకా వాటిని వినియోగించినట్లయితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ముఖ్యంగా వ్యాపారస్తులు ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని అదేవిధంగా వినియోగదారులు వస్తువులు కొనుగోలు చేయాలనుకున్నప్పుడు ఇంటి దగ్గర నుంచే బ్యాగులు తీసుకెళ్లాలన్నారు. దీంతో ప్లాస్టిక్ బ్యాగులు తిరిగి మన ఇంటికి రావు మన పరిసరాలు అపరిశుభ్రం కావున్నారు. ప్లాస్టిక్ ను కాల్చి వేయడం వల్ల వాటి నుంచి వచ్చే రసాయనాలతో క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని మనకు ఎటువంటి చెడు వ్యసనాలు లేనప్పటికీ మనం చేస్తున్నటువంటి పనులు అపరిశుభ్రత వాతావరణం వల్ల జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున ఈ విషయాలను ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకొని ప్లాస్టిక్ నివారణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com